జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట

18 మంగళవారం, ఆగస్టు 2026 పేజీలు:16










13లో

## తులం బంగారం దేవుడెరుగు..!?

కనీసం పేదింటి

“కళ్యాణమైన“ జరిపించండి..




**మహబూబ్‌నగర్ ఆగస్టు 17 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ప్రైవేటు వైద్యం అంటే ప్రాణానికి భరోసా కావాలి.. కానీ చికిత్స పేరుతో భారీ ఖర్చులు చేయించుకుని, లక్షల్లో దండుకుంటు చివరికి రోగి ప్రాణం పోతే బాధ్యత ఎవరిది.? అంటూ ఓ ప్రయివేట్ హాస్పిటల్ నిర్వాకం బయటపడింది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అభయ ప్రద ప్రైవేట్ ఆసుపత్రిలో చోటుచేసుకున్న ఓ వ్యక్తి మృతి ఘటనపై కుటుంబ సభ్యులు చేసిన ఆరోపణలు ఇప్పుడు ప్రైవేటు వైద్య రంగంలో బాధ్యత, పర్యవేక్షణ, ఆరోగ్యశ్రీ అమలుపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

మిగతా 2 లో

**హైదరాబాద్ / మహబూబ్ నగర్ ఆగస్టు 17 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ గౌరవ అధ్యక్షులుగా మాజీ మంత్రి విరసనోల్ల. శ్రీనివాస్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్పంచుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల అధ్యక్షులకు నియామక పత్రాలను అందజేశారు. అనంతరం తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ గౌరవ అధ్యక్షులుగా వి. శ్రీనివాస్ గౌడ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గ్రామ వ్యవస్థ బలోపేతం అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. గ్రామాలు నిర్వీర్యమైతే రాష్ట్రం కూడా నిర్వీర్యమవుతుందని పేర్కొన్నారు.

మిగతా 10 లో



# చికిత్స పేరుతో వసూళ్లు.. పర్యవేక్షణలో నిర్లక్ష్యమా..?

మొదటిపేజీ తరువాయి

**మహబూబ్‌నగర్ ఆగస్టు 17 ( ప్రజా జ్యోతి బ్యూరో ):** ప్రైవేటు వైద్యం అంటే ప్రాణానికి భరోసా కావాలి.. కానీ చికిత్స పేరుతో భారీ ఖర్చులు చేయించుకుని, లక్షల్లో దండుకుంటు చివరికి రోగి ప్రాణం పోతే బాధ్యత ఎవరిది.? అంటూ ఓ ప్రయివేట్ హాస్పిటల్ నిర్వాకం బయటపడింది.

- అభయ ప్రద ఆసుపత్రిలో వ్యక్తి మృతి.. వైద్యులపై తీవ్ర కుటుంబ సభ్యుల ఆరోపణలు
- ఆరోగ్యశ్రీపై నిర్లక్ష్యం చేశారంటూ ఆవేదన ఆసుపత్రి ఎదుట బంధువుల ఆందోళన టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అభయ ప్రద ప్రైవేట్ ఆసుపత్రిలో చోటుచేసుకున్న ఓ వ్యక్తి మృతి ఘటనపై కుటుంబ సభ్యులు చేసిన ఆరోపణలు ఇప్పుడు ప్రైవేటు వైద్య రంగంలో బాధ్యత, పర్యవేక్షణ, ఆరోగ్యశ్రీ అమలుపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. రాజాపూర్ మండలం కొచ్చెర్కల్ గ్రామానికి చెందిన పాండు రాయ గౌడ్ (75) గుండె సంబంధిత సమస్యతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్‌లోని అభయ ప్రద ఆసుపత్రిలో చేర్పించారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. 13వ తేది నుంచి మూడు రోజులపాటు ఆసుపత్రిలో చికిత్స అందించారు. వైద్యుల సూచన మేరకు పలు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు గుండెకు సంబంధించిన వైద్య ప్రక్రియలు కూడా చేపట్టినట్లు వారు తెలిపారు.

**ఆరోగ్యశ్రీ అడిగితే.. పట్టించుకోలేదంటూ ఆరోపణ:**

చికిత్స ఖర్చులు భరించే స్తోమత తమకు లేదని, ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స అందించాలని వైద్యులను కోరినప్పటికీ స్పందించలేదని మృతుడి కుమారుడు ఉదయ్‌కుమార్ ఆరోపించారు. ఆరోగ్యశ్రీ వంటి ప్రభుత్వ పథకాలు పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలుస్తున్న సమయంలో వాటి అమలుపై ఇలాంటి ఆరోపణలు రావడం ఆందోళన కలిగించే అంశమని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

**చికిత్స అనంతరం ఇంటికి పంపించడంపై అనుమానాలు:**

గుండె సంబంధిత సమస్యతో చికిత్స పొందుతున్న పాండు రాయ గౌడ్‌ను చికిత్స అనంతరం అవసరమైన వైద్య పర్యవేక్షణ లేకుండానే ఇంటికి పంపించారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. అనంతరం సోమవారం ఉదయం ఆయన అస్వస్థతకు గురికావడంతో తిరిగి అదే ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుమారుడు తెలిపారు.

**ఆసుపత్రి వద్ద బంధువుల ఆందోళన:**

పాండు రాయగౌడ్ మృతి విషయం తెలుసుకున్న బంధువులు ఆసుపత్రికి చేరుకుని వైద్యుల తీరును నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. తమకు సరైన సమాధానం ఇవ్వలేదని ఆరోపిస్తూ మహబూబ్‌నగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. "ప్రాణానికి విలువ లేదా?" తమ కుటుంబానికి జరిగిన అన్యాయంపై మృతుడి కుమారుడు ఉదయ్‌కుమార్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పేరుతో కుటుంబాలపై ఆర్థిక భారం పడుతున్నప్పటికీ, రోగి పరిస్థితిపై పూర్తి బాధ్యతతో పర్యవేక్షణ ఉండాల్సిన అవసరం ఉందన్నారు. తమ తండ్రి మృతిపై సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు వెలుగులోకి తీసుకురావాలని కోరారు. ఈ ఘటనతో మరోసారి "ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సకు చెల్లించే డబ్బుకు లెక్క ఉన్నప్పుడు.. రోగి ప్రాణానికి బాధ్యతకు కూడా లెక్క ఉండాలి కదా?" అనే ప్రశ్న ముందుకు వస్తోంది. అయితే, పాండు రాయగౌడ్ మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమా? చికిత్సలో ఏమైనా లోపాలు జరిగాయా? ఆరోగ్యశ్రీ పథకం వర్తింపుపై నిబంధనలు ఏమిటి? చికిత్స అనంతరం రోగిని డిశ్చార్జ్ చేయడం వైద్యపరంగా సమంజసమేనా? వంటి అంశాలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సమగ్ర విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది. కుటుంబ సభ్యుల ఆరోపణలు వాస్తవమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆరోపణల్లో వాస్తవం లేకపోతే అధికారిక విచారణ ద్వారా నిజానిజాలను ప్రజలకు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. మనిషి ప్రాణం వ్యాపార లెక్కల్లో మరో సంఖ్యగా మారకుండా వైద్య వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.



# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

## - ప్రజావాణిలో 93 ఫిర్యాదుల స్వీకరణ

**మహబూబ్‌నగర్, ఆగస్టు 17 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించే ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ఖుష్బూ గుప్తా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు భూ సమస్యలు, రెవెన్యూ, పింఛన్లు, సంక్షేమ పథకాలు, ఉపాధి, రహదారులు, తాగునీరు, గృహ నిర్మాణం తదితర అంశాలపై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజావాణిలో మొత్తం 93 ఫిర్యాదులను అధికారులు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, పరిష్కరించిన వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసి సంబంధిత దరఖాస్తుదారులకు సమాచారం అందించాలని ఆదేశించారు. ప్రజావాణి ద్వారా ప్రజలు తమ సమస్యలను నేరుగా జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువస్తున్నందున అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

**వ్యసన ముక్త్ భారత్ కోసం అధికారులతో బ్రహ్మకుమారీల ప్రతిజ్ఞ**

ప్రజావాణి కార్యక్రమం అనంతరం బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'వ్యసన ముక్త్ భారత్' ప్రచారంలో భాగంగా జిల్లా



అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీల ప్రతినిధులు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా 10 కోట్ల మందితో ప్రతిజ్ఞ చేయించాలనే లక్ష్యంతో ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 6 నుంచి 20వ తేదీ వరకు దాది ప్రకాశ్‌మణి స్మారకార్థం రక్తదాన శిబిరాలు, వ్యసన విముక్తి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మద్యం, పొగాకు, మాదకద్రవ్యాలతో పాటు మొబైల్ ఫోన్, స్క్రీన్ వినియోగం, ప్రతికూల ఆలోచనలు, పనులను వాయిదా వేయడం వంటి అలవాట్లు కూడా వ్యసనాలుగా మారుతున్నాయని తెలిపారు. వ్యసనాలకు దూరంగా ఉంటూ సానుకూల ఆలోచనలు, క్రమశిక్షణతో కూడిన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. వ్యసన ముక్త్ మహబూబ్‌నగర్, వ్యసన ముక్త్ తెలంగాణ, వ్యసన ముక్త్ భారత్ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**లిసెన్సస్ వివరాలను ఈ నెల 20లోగా అందించాలి: కలెక్టర్"**



అనంతరం జిల్లా ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, జిల్లాలో సెన్సస్ హౌస్ లిస్టింగ్ ఆపరేషన్ స్టేజ్-1 విజయవంతంగా పూర్తయిందని తెలిపారు. తదుపరి దశ సెన్సస్ ప్రక్రియలో భాగంగా జిల్లా సెన్సస్ హ్యాండ్‌బుక్ కోసం అవసరమైన సమాచారాన్ని శాఖల వారీగా నిర్దేశిత ఫార్మాట్‌లో సేకరిస్తున్నట్లు చెప్పారు. 31 సంబంధిత లైన్ డిపార్ట్‌మెంట్లు తమ పరిధిలోని వివరాలను ఖచ్చితంగా నమోదు చేసి ఈ నెల 20లోగా జిల్లా ప్రణాళిక శాఖకు పంపించాలని ఆదేశించారు. సెన్సస్‌కు సంబంధించిన రికార్డులు, ఫైళ్లను భద్రంగా ఉంచాలని, సెన్సస్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాంరెడ్డి, డీఆర్‌డీఓ నర్సింహులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

---

# విద్యార్థులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై అవగాహన కలిగి ఉండాలి: షి టీమ్ పోలీసులు

## జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు

**నర్వ ఆగస్టు 17 ప్రజా జ్యోతి**

నారాయణపేట జిల్లా నర్వ: మండల కేంద్ర కస్తూరిబా బాలికల వసతి గృహం, పాఠశాలలో విద్యార్థులకు సోమవారం షీ టీం పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు గుడ్ టచ్ బాడ్ టచ్, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, డ్రగ్స్, గంజాయి, ట్రాఫిక్ చట్టాలు, సెల్ ఫోన్ వినియోగం వల్ల ఏర్పడే అనర్థాలు, పోటీ పరీక్షల గురించి, లీడర్షిప్ లక్షణాలు, డయల్100 తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షి టీమ్ పోలీసులు కవిత, చెనప్ప లు మాట్లాడుతూ... విద్యార్థులు పాఠశాలకు వచ్చి పోయే సమయంలో ఎవరైనా అమ్మాయిలను వేధిస్తే షి టీమ్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని అలాగే తమకు తెలిసిన వాళ్ళు గా, సొంతంగా ఉండి అమ్మాయిలను అనేక రకాలుగా మోసం చేస్తున్నారని , గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై అవగాహన కలిగి ఉండాలని వివరించారు. గుడ్ టచ్ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రేమగా అలింగణం చేసుకోవడం, గురువులు విద్యార్థుల తల మీద లాలనగా చేతులు పెట్టడం, స్నేహితులు హై-పై ఇవ్వడం. బ్యాడ్ టచ్... ఇది బాలుడికి/ బాలికకు అసహజంగా, భయంగా, అపరాధ భారంగా అనిపించవచ్చు ఇది ప్రమాదకరమైనదిగా భావించాలి. ఎవరైనా ప్రైవేట్ భాగాలను అనవసరంగా తాకడం, ఒత్తిడి చేస్తూ అతుక్కోవడం లేదా ముద్దు పెట్టడం, ఒంటరిగా ఉండమని బలవంత పెట్టడం, హామీలతో లేదా బహుమతులతో ఆకర్షించడం స్పర్శకు ఒప్పించే దుకు ప్రయత్నించడం. సెల్ ఫోన్ లో అశ్లీలంగా, ఫోటోలు వీడియోలు చూపించడం పిల్లలు ఇలాంటి వాటికి దూరంగా ఉండాలని తెలిపారు.



**శ్రీవిద్యార్థులు గుర్తించుకోవాల్సిన విషయాలు:**

నా శరీరం నా సొంతం ఎవరు అనవసరంగా తాకకూడదని గుర్తుంచుకోవాలి. ప్రైవేట్ భాగాలు నచ్చని స్పర్శపై ఐ యాం నాట్ కంఫర్టబుల్ అని ధైర్యంగా చెప్పాలి. వెంటనే నమ్మదగిన పెద్దలకు తల్లిదండ్రులకు టీచర్కు పోలీస్ వారికి తెలియజేయాలి. ఒంటరిగా ఉండవద్దు ఎవరైనా గుప్తంగా మాట్లాడమంటే నిరాకరించాలి ఈ విషయాలను విద్యార్థినిలు తప్పకుండా గుర్తించుకోవాలని షి టీమ్ పోలీసులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. జిల్లా పరిధిలో ఎవరైనా ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ కు పాల్పడితే, వేధిస్తే నారాయణపేటపేట షీ టీం సెల్ నంబర్ 8712670398 కి లేదా డయల్ 100, 112 కి సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచి అట్టి వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అలాగే విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలంటే ప్రతిరోజు ఆటలు ఆడాలని, ఆటలు ఆడడం వల్ల లీడర్షిప్ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరు లీడర్షిప్ లక్షణాలు పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షి టీమ్ పోలీసులు, జ్యోతి, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి ప్రజావాణి

- ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి
- ఫిర్యాదుదారులకు సమాచారం ఇవ్వడంతో పాటు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి,
- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్



నాగర్ కర్నూల్ ఆగస్ట్ 17

(ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు, వినతులను అధికారులు సత్వరం పరిష్కరించి, ఆ వివరాలను సంబంధిత ఫిర్యాదుదారులకు తప్పనిసరిగా తెలియజేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆదేశించారు.సోమవారం నాగర్ కర్నూల్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.చెన్నయ్యతో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ప్రజల నుంచి అర్జీలు, వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై ప్రజలు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ....., ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి ఫిర్యాదును ఎప్పటికప్పుడు పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదు పరిష్కరించిన అనంతరం ఆ సమాచారాన్ని సంబంధిత ఫిర్యాదుదారునికి తెలియజేయడంతో పాటు ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేయాలని ఆదేశించారు.ఫిర్యాదుకు సంబంధించిన అంశం తమ శాఖ పరిధిలోకి రాని పక్షంలో, దరఖాస్తును సంబంధిత శాఖకు లేఖ ద్వారా పంపించి, ఆ విషయాన్ని ఫిర్యాదుదారునికి తెలియజేయాలని సూచించారు. ఏదైనా సమస్యను నిబంధనల ప్రకారం పరిష్కరించడం సాధ్యం కాకపోతే, ఆ విషయాన్ని స్పష్టంగా ఫిర్యాదుదారునికి తెలియజేయాలని, అవసరమైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. అంతేతప్ప దరఖాస్తులను తమ వద్ద పెండింగ్‌లో ఉంచకూడదని స్పష్టం చేశారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను ప్రత్యేకంగా పరిశీలించి, వెంటనే పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకోవాలని, ముఖ్యమంత్రి కార్యాలయం, నుంచి వచ్చిన ప్రజావాణి దరఖాస్తులకు కూడా అత్యంత ప్రాధాన్యతనిస్తూ సత్వరం పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు. సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 36 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా జిల్లాలోని 20 మండలాల పరిధిలో తొలిరోజు నిర్వహించిన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 103 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వర్తించేలా క్షేత్రస్థాయిలో అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ పాండు, కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అజ్జకొల్లులో వైద్య సిబ్బంది కొరత తీర్చాలి

## - అదనపు ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ నియమించాలి: బీసీ జేఏసీ

వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 17 (ప్రజాజ్యోతి):



అజ్జకొల్లు గ్రామానికి అదనపు ఏఎన్ఎంలతో పాటు డాక్టర్ ఎంఎల్‌హెచ్‌పీని నియమించి, గ్రామంలో 10 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని బీసీ పొలిటికల్ జేఏసీ వనపర్తి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి. మహేందర్ నాయుడు కోరారు. సోమవారం మదనాపురం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎంపీడీవోకు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్ నాయుడు మాట్లాడుతూ.. అధిక జనాభా కలిగిన అజ్జకొల్లు గ్రామంలో ప్రస్తుతం ఒకే ఏఎన్ఎం ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గ్రామానికి మరో ఏఎన్ఎంను నియమించడంతో పాటు డాక్టర్ ఎంఎల్‌హెచ్‌పీని అందుబాటులో ఉంచాలని కోరారు. గ్రామంలో ప్రభుత్వ ఆసుపత్రి లేకపోవడంతో పేద, మధ్యతరగతి ప్రజలు వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని, వెంటనే 10 పడకల ఆసుపత్రిని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మండలంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులను సక్రమంగా అందుబాటులో ఉంచాలని మండల వైద్యాధికారిని కోరారు. దీనిపై మండల వైద్యాధికారి భవాని సానుకూలంగా స్పందిస్తూ.. సమస్యను జిల్లా వైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు మహేందర్ నాయుడు తెలిపారు. కార్యక్రమంలో బాలవర్ధన్, వెంకటేష్ పాల్గొన్నారు.

# ఇచ్చిన హామీ నిలబెట్టుకున్న లక్ష్మీకాంత్ రెడ్డి గారు

## దేవాలయ అభివృద్ధికి 75 వేల విరాళం అందజేత

నర్వ ఆగస్టు 17 ప్రజా జ్యోతి

నారాయణ పేట జిల్లా నర్వ మండలం లక్కర్ దొడ్డి గ్రామం లో నూతనం గా నిర్మిస్తున్న హనుమాన్ మరియు శివాలయం దేవాలయాలకు 75000/- రూపాయలు ఇచ్చిన మాట ప్రకారం ధ్వజస్తంభ ఆరోహణ మరియు బొడ్రాయి పండగల సందర్భంగా లక్కర్ దొడ్డి గ్రామ సర్పంచ్ సుశీల దేవన్న గార్ల ఆహ్వానం మేరకు వెళ్ళిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి గారు ఇచ్చిన మాట ప్రకారం 75000/- రూపాయలు ఆ గ్రామ ప్రజలు వివిధ పార్టీల నాయకుల సమక్షంలో సర్పంచ్ కు అందించడం జరిగింది. ఇట్టి కార్యక్రమం గ్రామ సర్పంచ్ సుశీల దేవన్న , ఉప సర్పంచ్ వెంకటేశ్వర రెడ్డి , మాజీ సర్పంచ్ శివ , బీజేపీ నర్వ మండల అధ్యక్షులు అజిత్ సింహా రెడ్డి , ప్రధాన కార్యదర్శి విజయ్ రామ్ , నీరజ్ వావిళ్ళ వెంకటేశ్వర రెడ్డి , రామ్ రెడ్డి పల్లె రామ్ రెడ్డి , హనుమంత్ రెడ్డి , మున్నూరు రామ్ రెడ్డి , గ్రామ బూత్ అధ్యక్షులు చందు , నర్వ బూత్ అధ్యక్షులు కిష్టారెడ్డి , బాలు , గ్రామ బీజేపీ నాయకులు కార్యకర్తలు మరియు వివిధ పార్టీల నాయకులు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# నర్వ ప్రజావాణి కి ఒక్క ఫిర్యాదు

నర్వ ఆగస్టు 17 ప్రజా జ్యోతి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం నర్వ మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల విభాగంలో ఒక్క దరఖాస్తు మాత్రమే వచ్చిందని ఎంపీడీవో శ్రీనివాసులు. తెలిపారు, గ్రామాలలోని ప్రజలు వివిధ సమస్య ల పరిష్కారానికై జిల్లా కేంద్రానికి ప్రతి సోమవారం జరిగే ప్రజావాణికి వెళ్లి ఇబ్బందులు పడకుండా మండల ప్రజలకు ఆయా మండల కేంద్రంలోనే ప్రతి సోమవారం ప్రజావాణి చాంబర్లో ఏర్పాటు చేశారు, తమ సమస్యలను ప్రతి సోమవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద వచ్చి ప్రజావాణిలో ఫిర్యాదు చేసుకొని దరఖాస్తులు ఇవ్వాలని ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు, ఈ సమావేశంలో ఆ శాఖల అధికారులు అందరూ కూడా హాజరవుతున్నట్లు తెలిపారు



# స్మశానవాటికలో మౌలిక వసతులు కల్పించాలి

## - మున్సిపల్ చైర్‌పర్సన్‌కు ఆర్యవైశ్య సంఘం వినతి

**వనపర్తి, ఆగస్టు 17 (ప్రజాజ్యోతి):**

వనపర్తి పట్టణంలోని హిందూ స్మశానవాటికలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము మున్సిపల్ చైర్‌పర్సన్ మిడిదొడ్డి మాధవీలతకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బచ్చు రాము మాట్లాడుతూ.. వనపర్తి పట్టణం ఏర్పడి సుమారు 300 సంవత్సరాలు గడిచినా, పట్టణ జనాభాకు అనుగుణంగా సరైన హిందూ స్మశానవాటిక లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రస్తుత స్మశానవాటికలో దహన సంస్కారాలకు అవసరమైన పరికరాలు అందుబాటులో లేకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. దహన సంస్కారాలకు పనిచేసే వారు రూ. 20 వేలకు పైగా డిమాండ్ చేస్తుండటంతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. ప్రస్తుత దహనవాటికలోని ఇనుప దిమ్మె ఎక్కువ ఎత్తులో, అధిక విస్తీర్ణంలో ఉండటంతో వినియోగానికి అనుకూలంగా లేక నిరుపయోగంగా మారుతోందన్నారు. ఈ సమస్యలను గతంలోనే జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులతో పాటు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదని తెలిపారు. విద్యుత్ దహన యంత్రం ఏర్పాటు చేయడంతో పాటు పట్టణ జనాభాకు అనుగుణంగా నూతన స్మశానవాటికకు స్థలం కేటాయించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న స్మశానవాటికలో ఖననం కోసం స్థలం తవ్వినప్పుడు గతంలో ఖననం చేసిన వారి పుర్రెలు బయటపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్మశానవాటికలో నీటి వసతి, మరుగుదొడ్లు, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక గది తదితర కనీస మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పట్టణ పరిసరాల్లో భూముల ధరలు పెరగడంతో ప్రైవేట్ స్థలాల్లో ఖనన సంస్కారాలకు అవకాశం లేకుండా పోయిందన్నారు. అందువల్ల పట్టణ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నూతన స్మశానవాటిక ఏర్పాటు చేసి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. అలాగే స్మశానవాటిక నిర్వహణ కోసం ఇద్దరు మున్సిపల్ కార్మికులను నియమించి, వారికి ప్రత్యేక పారితోషికం నిర్ణయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి ఎలిసెట్టి వెంకటేష్, కోశాధికారి ఏపూరి శ్రీనివాసులు, మాజీ అధ్యక్షుడు మారం బాలీశ్వరయ్య, లెగిశెట్టి అశోక్, దాచే శివ, యువజన సంఘం అధ్యక్షుడు బచ్చు వెంకటేశ్, వర్తక సంఘం అధ్యక్షుడు పాలాది సుమన్, చుక్కయ్య, మారం గోవిందు, కొండూరు ప్రవీణ్, భూపేష్, రఘు తదితర ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.



# మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాలకు శ్రీకారం

## - నారాయణపేట ఎంపీడీవో కార్యాలయంలో

## ప్రజావాణిని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ప్రియాంక

**నారాయణపేట ప్రతినిధి ఆగస్టు 17 (ప్రజా జ్యోతి)**

నారాయణపేట జిల్లాలో మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా నారాయణపేట ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ ప్రియాంక లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వివిధ సమస్యలు, వినతులను స్వీకరించి, వాటిని పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో కొత్త పింఛన్లకు వచ్చిన దరఖాస్తుల వివరాలను కంప్యూటర్ ఆపరేటర్ ను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయ కార్య కలాపాలను పారదర్శకంగా కొనసాగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ అమరేంద్ర కృష్ణ, ఎంపీడీవో విజయలక్ష్మి, ఎం ఈ వో బాలాజీ, వివిధ శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.





# అక్టోబర్ 6న మాదిగ విద్యార్థుల జాతీయ మహాసభను విజయవంతం చేయాలి

**వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్.**

పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నూతన కమిటీల నిర్మాణం మరియు అక్టోబర్ 06 న హైదరాబాదులో ఎం ఎస్ ఎఫ్ ఆధ్వర్యంలో జరిగే మాదిగ విద్యార్థుల జాతీయ మహాసభ విజయవతనికై మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మీసాల నాగరాజు మాదిగ ఎమ్మార్పీఎస్ ఇంచార్జ్ హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం సుదీర్ఘ పోరాటం చేసి సాధించుకున్నాం, సాధించుకున్న వర్గీకరణ ఫలాలను జాతికి అందించాల్సిన బాధ్యత మనదేనని, ఎం ఎస్ ఎఫ్ , ఎమ్మార్పీఎస్ సమాజంలోని అన్ని వర్గాల కోసం పోరాటం చేసిన చరిత్ర ఉందన్నారు. భవిష్యత్తులో మనం విద్యారంగ సమస్యలపై సాంఘిక సంక్షేమ హాస్టల్ సమస్యలపై పోరాటం చేయాలన్నారు ఇందుకోసం వనపర్తి జిల్లాలోని అన్ని కళాశాలలో నూతన కమిటీలు వేసి ఉద్యమాన్ని బలోపేతం చేసి మరో పోరాటానికి సిద్ధం కావాలని అన్నారు. అలాగే అక్టోబర్ 06 న హైదరాబాదులో జరిగే మాదిగ విద్యార్థుల జాతీయ మహాసభ విజయవంతం చేయాలనీ విద్యార్థులు పెద్ద ఎత్తున భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం అనంతరం నూతన కమిటీ వేయడం జరిగింది అధ్యక్షులు.బొల్లి హర్ష మాదిగ ఉపాధ్యక్షులు: అనూష మాదిగ అధికార ప్రతినిధి దయ్యపు రామ్ చరణ్ తేజ మాదిగ ప్రధాన కార్యదర్శి తొల్లు మహేశ్వరి మాదిగ సహాయ కార్యదర్శి వెంకటేష్ మాదిగ రవితేజ మాదిగ, హేమ మాదిగ,బాలు, కర్ణాకర్, సిద్ధూ, వినోద్ మరియు కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు



# డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల



- సెప్టెంబర్ 16లోగా క్లెయిమ్స్, అభ్యంతరాలు దాఖలు చేయాలి
- అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు
- ఓటర్లు తప్పనిసరిగా డ్రాఫ్ట్ జాబితాను పరిశీలించాలి
- అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా విడుదల
- జిల్లా ఎన్నికల అధికారి& కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

**నాగర్ కర్నూల్ ఆగస్టు 17 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**



భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ సోమవారం విడుదల చేశారు. నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 910 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ప్రకటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల జాబితా అత్యంత కీలకమైనదని, అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడటంతో పాటు, అనర్హమైన లేదా నిబంధనలకు విరుద్ధంగా నమోదైన ఓటర్ల వివరాలను గుర్తించి సరిచేయడమే ఎస్ఐఆర్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ఖచ్చితత్వం, పారదర్శకత, విశ్వసనీయతను పెంచే విధంగా సవరణ ప్రక్రియను చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో జూన్ 25 నుంచి ఆగస్టు 10 వరకు బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను సేకరించినట్లు, ప్రస్తుత ఓటర్ల జాబితా ఆధారంగా ప్రతి ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారం అందజేసి వివరాలను నమోదు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. బీఎల్ఓలు సేకరించిన వివరాలను సంబంధిత రికార్డులతో సరిపోల్చి, ఎన్యూమరేషన్ ఫారాలు, క్షేత్రస్థాయి పరిశీలన, అందుబాటులో ఉన్న సమాచారాన్ని సమగ్రంగా పరిశీలించిన అనంతరం డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను.రూపొందించినట్లు తెలిపారు.ఎస్ఐఆర్‌లో భాగంగా ప్రస్తుత ఓటర్ల వివరాలను 2002 నాటి ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ చేసే ప్రక్రియను కూడా నిర్వహించినట్లు, కుటుంబ సంబంధాలు, చిరునామాలు, ఇతర సంబంధిత సమాచారాన్ని పరిశీలించి ప్రస్తుత వివరాలతో సరిపోల్చినట్లు కలెక్టర్ తెలిపారు.2026 జూన్ 10 నాటికి నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 880 పోలింగ్ కేంద్రాల్లో 7,31,632 మంది ఓటర్లు నమోదై ఉన్నారని కలెక్టర్ తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియ అనంతరం పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణతో వాటి సంఖ్య 910కి పెరిగిందని, ఆగస్టు 17న విడుదల చేసిన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ప్రకారం జిల్లా వ్యాప్తంగా మొత్తం 6,18,592 మంది ఓటర్లు ఉన్నట్లు, 3,11,395 మంది పురుష ఓటర్లు, 3,07,182 మంది మహిళా ఓటర్లు, 15 మంది ఇతరులు, 579 సర్వీస్ ఓటర్లు ఉన్నాయని తెలిపారు ఎస్ఐఆర్ సందర్భంగా 22,669 మంది ఓటర్లు మరణించినట్లు బీఎల్ఓల క్షేత్రస్థాయి పరిశీలనలో గుర్తించి అధికారికంగా నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే 18,260 మంది ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించలేదని, మరో 20,396 మంది ఓటర్లు రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు లేదా నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఇతర అసెంబ్లీ నియోజకవర్గాలకు తమ ఓటు నమోదును మార్చుకున్నట్లు పరిశీలనలో వెల్లడైందని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాపై 2026 ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాపై వచ్చే క్లెయిమ్స్, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కరించిన అనంతరం 2026 అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ తెలిపారు. డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదలైన నేపథ్యంలో జిల్లాలోని ప్రతి ఓటరూ తమ పేరు జాబితాలో ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని, పేరు మాత్రమే కాకుండా ఓటరు పేరు, తండ్రి/భర్త పేరు, వయస్సు, లింగం, చిరునామా తదితర వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో కూడా పరిశీలించుకోవాలని కలెక్టర్ సూచించారు.కుటుంబంలోని అర్హులైన ప్రతి సభ్యుడి పేరు జాబితాలో ఉందో లేదో పరిశీలించాలని, అర్హత ఉన్నప్పటికీ పేరు లేకపోతే వెంటనే సంబంధిత ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. వివరాల్లో తప్పులు ఉంటే నిర్ణీత విధానంలో సవరణకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.అర్హత ఉన్నప్పటికీ పేరు డ్రాఫ్ట్ జాబితాలో లేని వారు నిర్ణీత గడువులోగా క్లెయిమ్ దాఖలు చేసుకోవాలని, జాబితాలోని ఏదైనా నమోదుపై అభ్యంతరం ఉన్న వారు నిబంధనల ప్రకారం అభ్యంతరం దాఖలు చేయవచ్చని, చివరి తేదీ వరకు వేచి ఉండకుండా వీలైనంత త్వరగా దరఖాస్తులు సమర్పించాలని ప్రజలను కోరారు.డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలోని ఏదైనా నమోదుపై అభ్యంతరం వచ్చినప్పుడు సంబంధిత వ్యక్తులకు ఎన్నికల నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. నోటీసులు అందుకున్న వారు తమ అర్హతకు సంబంధించిన వివరాలు, అవసరమైన ఆధారాలను సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు. సమర్పించిన ఆధారాలను నిబంధనల ప్రకారం పరిశీలించిన అనంతరం తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతంగా పూర్తిచేయడంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారం ఎంతో ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల, క్లెయిమ్స్, అభ్యంతరాల గడువు, దరఖాస్తు విధానం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన ఓటర్ల పేర్లు డ్రాఫ్ట్ జాబితాలో లేకపోతే గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ నిర్ణీత గడువులోగా క్లెయిమ్ దాఖలు చేసేలా సహకరించాలని కోరారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పక్షపాతం లేకుండా పూర్తిగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడికి ఓటు హక్కు అందేలా చూడటంతో పాటు, ఓటర్ల జాబితా విశ్వసనీయతను కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కు అని కలెక్టర్ అన్నారు. ఓటర్ల జాబితాలో తమ పేరు, కుటుంబ సభ్యుల పేర్లు, చిరునామా తదితర వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ నియోజకవర్గాల పరిధిలో అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే క్లెయిమ్స్, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కరించిన అనంతరం తుది ఓటర్ల జాబితాను రూపొందిస్తామని జిల్లా ఎన్నికల అధికారి& కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రవి కుమార్, ఎన్నికల డిటీ కల్పన, భారతీయ జనతా పార్టీ తరపున నాగేందర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ తరపున, ఎండి హబీబ్, రాజేందర్, చింతల రాజ్ గోపాల్, వైయస్సార్సీపి నుండి ఎండి హుస్సేన్, టిడిపి పార్టీ నుండి డి బాలకృష్ణ, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధిగా నరసింహ, విష్ణు, సిపిఎం పార్టీ తరపున పర్వతాలు, అశోక్, తదితరులు ఉన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలి



**నారాయణపేట ప్రతినిధి ఆగస్టు 17 (ప్రజా జ్యోతి)**

ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ లోని ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 15 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణి అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా సత్వరం పరిష్కరించాలన్నారు. శాఖల వారీగా ఆయా అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డి.ఆర్.ఓ.రాజేశ్వరి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి బేస్‌లైన్ డేటా కీలకం





## - ప్రతి గ్రామ పంచాయతీకి సంబంధించిన సమాచారాన్ని క్షుణ్ణంగా సేకరించి ధ్రువీకరించాలి.

## - జిల్లా కలెక్టర్ ప్రియాంక.

**నారాయణపేట ప్రతినిధి ఆగస్టు 17 (ప్రజా జ్యోతి)**

గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల స్థాయిలో సమగ్ర బేస్‌లైన్ డేటా సేకరణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులకు సూచించారు. భవిష్యత్‌లో మౌలిక వసతులు, విద్య, వైద్యం, తాగునీరు, పారిశుద్ధ్యం, రవాణా, విద్యుత్, వ్యవసాయం, పరిశ్రమలు తదితర రంగాల్లో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించేందుకు ఈ డేటా కీలక ఆధారంగా ఉంటుందని ఆమె తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని ప్రజా వాణి హాల్ లో జరిగిన డీసీహెచ్‌బీ – జనగణన – 2027 సమావేశంలో జిల్లా అధికారులకు కలెక్టర్ పలు సూచనలు, కీలక ఆదేశాలు జారీ చేశారు.ప్రస్తుతం జరుగుతున్న భారత జనాభా లెక్కలు 2027 (16వ జనగణన) లో భాగంగా, మునుపటి కంటే భిన్నంగా ఈసారి సరికొత్త డిజిటల్ పద్ధతుల్లో డీ సీ హెచ్ బీ డేటా సేకరణ ప్రక్రియ సాగుతోందనీ, జిల్లాకు విడివిడిగా డీ సీ హెచ్ బీ నివేదికను నిరంతరాయంగా ప్రచురిస్తున్నారని, ఇది క్షేత్రస్థాయి (గ్రామ, పట్టణ) ప్రణాళికలు, అభివృద్ధి పథకాల రూపకల్పనకు ప్రధాన వనరుగా ఉపయోగపడుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు.గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ ఫంక్షనరీలకు డేటా సేకరణ విధానంపై ఇప్పటికే శిక్షణ అందించినట్లు తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీకి సంబంధించిన సుమారు 400 అంశాలు, మున్సిపాలిటీలకు సుమారు 420 అంశాలకు సంబంధించిన సమాచారాన్ని సంబంధిత శాఖల నుంచి సేకరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.విద్యకు సంబంధించిన పాఠశాలలు, కళాశాలలు, వృత్తి విద్యా సంస్థలు, వాటి నిర్వహణ విధానం, దూరం తదితర వివరాలను నమోదు చేయాలని సూచించారు. అదే విధంగా వైద్య రంగంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు, వైద్య సిబ్బంది, పడకల సంఖ్య, పారామెడికల్ సిబ్బంది, మెడికల్ షాపులు తదితర వివరాలను సేకరించాలన్నారు.తాగునీరు, పారిశుద్ధ్యం, రవాణా, పోస్టల్, మొబైల్ నెట్‌వర్క్, విద్యుత్, బ్యాంకింగ్, భూముల వినియోగం, సాగునీరు, వ్యవసాయం, పశుసంవర్ధక, పరిశ్రమలు తదితర అన్ని రంగాలకు సంబంధించిన సమాచారాన్ని సమగ్రంగా నమోదు చేయాలని సూచించారు.ప్రతి డేటాను క్షుణ్ణంగా పరిశీలించాలని, డేటా సేకరణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా సంబంధిత అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. పంచాయతీ స్థాయిలో సేకరించిన సమాచారాన్ని మండల, జిల్లా స్థాయిలో సంబంధిత లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు తప్పనిసరిగా పరిశీలించి ధ్రువీకరించాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో సంబంధిత శాఖల ఫీల్డ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, విద్యుత్ శాఖ సిబ్బంది, వ్యవసాయ, వైద్య, రవాణా తదితర శాఖల అధికారులు సమన్వయంతో సమావేశాలు నిర్వహించి సమాచారాన్ని నిర్ధారించుకోవాలని సూచించారు.

### 15 రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలి

డేటా సేకరణ, పరిశీలన, అవసరమైన సవరణల ప్రక్రియను 15 రోజుల్లో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. వచ్చే వారంలో మండల, జిల్లా స్థాయిలో సమీక్ష నిర్వహించి ప్రతి గ్రామ పంచాయతీకి సంబంధించిన డేటా సేకరణ ఎంతవరకు పూర్తయింది, సంబంధిత అధికారులు ధ్రువీకరించారా లేదా అనే అంశాలను పరిశీలించనున్నట్లు తెలిపారు.ప్రతి గ్రామ పంచాయతీకి ప్రత్యేకతగా ఉన్న పర్యాటక ప్రాంతాలు, చేనేత, స్థానిక ఉత్పత్తులు, ప్రత్యేక వృత్తులు, ఇతర అభివృద్ధి అవకాశాలను కూడా డేటాలో నమోదు చేయాలని సూచించారు. భవిష్యత్‌లో 20 నుంచి 30 సంవత్సరాల వరకు అభివృద్ధి ప్రణాళికలకు ఈ బేస్‌లైన్ డేటా ఉపయోగపడే అవకాశం ఉన్నందున ప్రతి అధికారి ఈ కార్యక్రమాన్ని అత్యంత బాధ్యతతో నిర్వహించాలని కోరారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నాణ్యమైన, ఖచ్చితమైన డేటాను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డీఆర్వో రాజేశ్వరి ఉన్నారు.

---

## ప్రజావాణిని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**గద్వాల ఆగస్టు 17(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

మండల ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మల్దకల్ ఎంపీడీవో ఆంజనేయ రెడ్డి కోరారు.ప్రభుత్వ ఉత్తర్వు నంబర్ 4,తేదీ 04-08-2026 ప్రకారం ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.మల్దకల్ మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు.ప్రజలు తమ అర్జీలు,ఫిర్యాదులు, సమస్యలను నేరుగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కారం పొందేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎంపీడీవో సూచించారు.ఈ కార్యక్రమానికి మండల స్థాయిలోని 24 శాఖలకు చెందిన అధికారులు హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులు:ఎమ్మార్వో కార్యాలయం 3,అగ్రికల్చర్ కార్యాలయం 1,ఎంపీడీవో 5,ఎంపీవో 3. మొత్తం 12 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు.



## కళ్యాణలక్ష్మి పథకం కొనసాగించాలి – బీఆర్ఎస్ పార్టీ నేతలు నిరసన

**గద్వాల (ప్రజా జ్యోతి) ఆగస్టు 17:**

గద్వాల జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు ఆధ్వర్యంలో కళ్యాణలక్ష్మి,షాదీముబారక్ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు.పార్టీ ఇన్‌చార్జి బాసు శ్యామల హనుమంతు నాయుడు,మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్.కేశవ్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి ర్యాలీ నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.గతంలో అందించిన రూ.1,00,116 లు సాయాన్ని కొనసాగించాలని,పథకాలను నిలిపివేసే ప్రయత్నాలను అడ్డుకోవాలని వారు డిమాండ్ చేశారు.పథకాలు పునరుద్ధరించే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.



# రాజ్యాంగ విలువలను కాపాడాలి

## డిసీసీ అధ్యక్షులు కె. ప్రశాంత్ కుమార్ రెడ్డి

- హల్ద్వానీ ఘటనపై కాంగ్రెస్ ఆగ్రహం.
- హల్ద్వానీ ఘటనపై నారాయణపేటలో కాంగ్రెస్ సత్యాగ్రహం.
- కుల వివక్షకు వ్యతిరేకంగా గళమెత్తిన కాంగ్రెస్.
- ఖర్గే కు జరిగిన అవమానంపై నారాయణపేటలో మహాధర్నా.
- హల్ద్వానీ ఘటనపై సమగ్ర విచారణ జరపాలి.

**నారాయణపేట ప్రతినిధి ఆగస్టు 17 (ప్రజా జ్యోతి)**





ఉత్తరఖాండ్ రాష్ట్రంలోని హల్ద్వానీ లో జరిగిన కులావివక్ష ఘటనకు నిరసనగా ఏఐసీసీ మరియు టిపిసిసి కమిటీ పిలుపు మేరకు సోమవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షులు కె.ప్రశాంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సత్యాగ్రహ మహాధర్నా నిర్వహించారు.సీవీఆర్ భవన్ నుంచి కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు భారీ ర్యాలీగా అంబేద్కర్ చౌరస్తా వరకు పాదయాత్ర నిర్వహించారు.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం అక్కడే సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు కె.ప్రశాంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ హల్ద్వానీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే పాల్గొన్న సభ అనంతరం జరిగిన ఘటన అత్యంత బాధాకరమన్నారు.ప్రజా సభ జరిగిన ప్రదేశాన్ని 'శుద్ధీకరణ' పేరుతో బిజెపి పార్టీ కి చెందిన కొందరు సానుభూతి పరులు గంగజాలం తో శుభ్రం చేయడం కుల వివక్షకు సంబంధించిన ఆలోచనలకు తావిచ్చే చర్యగా కనిపిస్తోందన్నారు.ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు.రాజకీయ విభేదాలు ఎన్ని ఉన్నా ఒక వ్యక్తి కులం ఆధారంగా అతని గౌరవాన్ని కించపరిచే చర్యలు జరగడం బాధాకరమన్నారు.అంటరానితనాన్ని రాజ్యాంగం నిషేధించినప్పటికీ ఇలాంటి ఘటనలు బిజెపి పార్టీ ప్రోత్సహించడం సిగ్గుచేటన్నారు.మల్లికార్జున్ ఖర్గే గారికి జరిగిన అవమానం ఒక్క వ్యక్తికి జరిగిన అవమానం కాదని,కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రతి ఒక్కరికీ జరిగిన అవమానమని అన్నారు.ఈ ఘటనకు బీజేపీకి చెందిన కొందరు సానుభూతిపరుల ప్రమేయం ఉందని దీనిపై బీజేపీ నాయకత్వం ఘటనను బహిరంగంగా ఖండించి,సమగ్ర విచారణకు సహకరించాలని డిమాండ్ చేశారు.కుల వివక్షను ప్రోత్సహించే చర్యలకు ఎవరి మద్దతు ఉన్నా కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు.ఘటనకు బాధ్యులు ఎవరైనా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సత్యాగ్రహ దీక్షను జిల్లా కేంద్రానికే పరిమితం చేయకుండా ప్రతి మండలం,ప్రతి గ్రామానికి తీసుకెళ్లాలి ఈ ఘటన ను ఖండించాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత మనపై ఉంది.ముసాయిదా ఓటర్ల జాబితా వచ్చినప్పుడు కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా నిబంధనల ప్రకారం పరిశీలించాలని కోరారు. బూత్ స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

బీఎల్ఏలు ఒక్కరే అన్నీ చేయలేరని, ప్రతి కాంగ్రెస్ నాయకుడు ఇందులో భాగస్వామి కావాలన్నారు.ఈ కార్యక్రమంలో పేట,కోస్గి, మక్తల్ మార్కెట్ చైర్మన్ లు శివారెడ్డి,భీములు,రాధ లక్ష్మారెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. సలీం,జిల్లా అధికార ప్రతినిధి సంతోష్,క్రమశిక్షణ సంఘం జిల్లా అధ్యక్షులు గాజుల శివకుమార్,ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షులు వెంకటయ్య,మండల, పట్టణ అధ్యక్షులు కోట్ల.రవీందర్ రెడ్డి, వెంకటేష్ గౌడ్,అనంద్, విజ్జప్ప గౌడ్,సూర్య ప్రకాష్ రెడ్డి,శివరాంరెడ్డి,బాలయ్య,మాజీ మార్కెట్ చైర్మన్ లుబండి. వేణుగోపాల్, సుధాకర్,ఎండి.గౌస్,నరహరి,వైస్ చైర్మన్ కె. హన్మంతు,బోయ. శరణప్ప,పళ్ళ అనిల్,పిఏసిఎస్ చైర్మన్ ఈదప్ప,నిరంజన్ రెడ్డి కౌన్సిలర్లు రాజేష్ ఘూట్, కుర్వ మనోజ్,శంకర్,ఉగ్గు రాజు,ఆర్టివో బోర్డ్ డైరెక్టర్ పోషల్ రాజేష్,యూత్ జిల్లా అధ్యక్షులు కోట్ల.మధుసూదన్ రెడ్డి,యూత్ మండల అధ్యక్షులు మహేష్, సర్ఫరాజ్, వేణు గౌడ్,అఖిల్ రెడ్డి,యస్సి సెల్ మండల అధ్యక్షులు చంద్రయ్య,శ్రీను,చందర్, రాజేష్,రాములు తదితరులు పాల్గొన్నారు.

---

# ప్రజలు అత్యవసర సమయంలో జాతీయ టోల్‌ఫ్రీ నంబర్ 112 సద్వినియోగం చేసుకోవాలి: టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు

**నారాయణపేట ప్రతినిధి ఆగస్టు 17 (ప్రజా జ్యోతి)**





నారాయణపేట: అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు పోలీసుల సహాయం త్వరితగతిన అందించేందుకు 112 జాతీయ టోల్‌ఫ్రీ నంబర్‌పై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు నారాయణపేట జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తాలో టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... అత్యవసర పోలీస్ సహాయం కోసం గతంలో ఉపయోగించే డయల్ 100కు బదులుగా 112 జాతీయ టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. దేశవ్యాప్తంగా అత్యవసర సేవల కోసం 112 నంబర్ అందుబాటులో ఉందని తెలిపారు.ప్రమాదాలు, నేర సంఘటనలు, మహిళలు లేదా బాలికల భద్రతకు సంబంధించిన అత్యవసర పరిస్థితులు, ప్రజల ప్రాణాలు లేదా ఆస్తులకు ముప్పు ఉన్న సందర్భాల్లో వెంటనే 112కు కాల్ చేసి పోలీసుల సహాయం పొందాలని సూచించారు.112కు కాల్ చేసినప్పుడు సంఘటన జరిగిన ప్రదేశం, పరిస్థితి, అవసరమైన సహాయం వంటి వివరాలను స్పష్టంగా తెలియజేయాలని కోరారు. సమాచారం అందిన వెంటనే సంబంధిత పోలీస్ సిబ్బందికి సమాచారం చేరి, అవసరమైన సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటారని తెలిపారు.ముఖ్యంగా విద్యార్థులు, యువత 112 నంబర్‌పై అవగాహన కలిగి ఉండాలని, తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు మరియు చుట్టుపక్కల ప్రజలకు కూడా ఈ అత్యవసర సేవ గురించి తెలియజేయాలని ఎస్ఐ సూచించారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ చైతన్య, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఉడిపి పాలిమర్ మఠం పీఠాధిపతుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు

## - జంట నాగులకు ప్రత్యేక అభిషేక పూజలు

**గద్వాల ఆగస్టు 17(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల పరిధిలోని పెద్ద చింతరేవుల గ్రామంలోని 18వ,శతాబ్దం నాటి శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో నాగపంచమి సందర్భంగా జంట నాగుల స్వామివారికి ఉడిపి పాలిమర్ మఠం పీఠాధిపతులు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు.ఈ విషయాన్ని ఆలయ ప్రధాన అర్చకులు ఆద్య చక్రవర్తి కేశవాచార్యులు తెలిపారు.శ్రావణ సోమవారం సందర్భంగా పాలిమర్ మఠం పీఠాధిపతులు శ్రీ 1008 విద్యాదిశ శ్రీపాదుల వారు,శ్రీ 1008 విద్యారాజేశ్వర శ్రీపాదుల వారు ఆలయంలోని మూలవిరాట్ శ్రీ ఆంజనేయ స్వామివారికి సంస్థాన పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ ఆవరణలోని జంట నాగుల స్వామివారికి పంచామృతం,వివిధ సుగంధ ద్రవ్యాలతో శాస్త్రోక్తంగా విశేష అభిషేక పూజలు నిర్వహించారు.నాగపంచమి రోజున జంట నాగులకు పూజలు,అభిషేకాలు నిర్వహించడం వల్ల శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి కృపాకటాక్షం భక్తుల కుటుంబాలపై ఉంటుందని ప్రధాన అర్చకులు తెలిపారు.జంట నాగుల స్వామివారిని భక్తిశ్రద్ధలతో పూజించిన వారికి సుపుత్ర సంతానం,అష్టైశ్వర్యాలు, జ్ఞానం,కీర్తి ప్రాప్తిస్తాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పెద్ద చింతరేవుల అన్న ప్రసాద ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఆలయ





అర్చకులు ఆద్య వామనాచారి,ఆద్య కిష్టాచారి,ఆద్య మద్వాచారి,భక్తులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి కార్యక్రమం ప్రారంభించిన ఎమ్మార్వో.ఎంపీడీవో

**గద్వాల (ప్రజా జ్యోతి) ఆగస్టు 17:**

జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆదేశాల మేరకు జిల్లాలో ప్రతి మండలంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించాలని ప్రజల యొక్క చిన్న చిన్న సమస్యలు ఏవైనా ఉంటే అవి కలెక్టర్ ఆఫీస్ వరకు వస్తున్నారు అలా ఉండకూడదని ఆ చిన్న చిన్న సమస్యలు కిందిస్థాయి అధికారులే మండలంలో ప్రజల యొక్క సమస్యలను తీర్చే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలపడంతో.సోమవారం17వ తారీఖున ప్రజావాణి కార్యక్రమం ఇటిక్యాల మండల ఎమ్మార్వో.శ్రీకాంత్ రెడ్డి. ఎంపీడీవో.రామాదేవి ఎంపీ ఓ,సునీల్ మిగతా అధికారుల ద్వారా ప్రారంభించడం జరిగింది అయితే మొదటి సోమవారం ప్రజావాణి కావడంతో ప్రజలకు చాలావరకు తెలియకపోవడంతో చాలావరకు రాలేకపోయారు ఏది ఏమైనా ప్రజావాణి లో 5 అప్లికేషన్ రావడం జరిగిందని అధికారులు తెలిపారు ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే ప్రతి సోమవారం మండలంలోని ఎంపీడీవోకార్యాలయంలో అప్లికేషన్ తీసుకొని సమస్యలను తీర్చడం జరుగుతుందని 23 శాఖల అధికారులు ఉంటరు కాబట్టి ఏ శాఖలో ఏ సమస్యలు ఉన్నాయో తెలపాలని అధికారులు తెలిపారు. ప్రతి ఒక్కరు కూడా గ్రామాల వారు మీ యొక్క సమస్యలను ప్రజావాణి కార్యక్రమంలో తెలిపితే సమస్యలను తీర్చడానికి మేమున్నాము అని అధికారులు తెలిపారు కాబట్టి ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని తెలిపారు.




# సత్వర పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు అదనపు ఎస్పీ కె.శంకర్

## - ప్రజావాణిలో 10 ఫిర్యాదులు స్వీకరణ

**గద్వాల ఆగస్టు 17(ప్రజా జ్యోతి ప్రతినిధి)**

:జోగుళాంబ గద్వాల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల నుంచి 10 ఫిర్యాదులను స్వీకరించినట్లు జిల్లా అదనపు ఎస్పీ కె.శంకర్ తెలిపారు.ఫిర్యాదుల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదులపై సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ,పోలీస్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు,ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ కట్టుబడి పనిచేస్తోందన్నారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో అధికారులు,సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించి,వారి ఫిర్యాదులను స్వీకరించాలని సూచించారు.అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి, చట్టప్రకారం న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదుదారుల్లో పోలీస్ శాఖపై నమ్మకం,భరోసా పెంపొందేలా అధికారులు వ్యవహరించాలని సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి,వాటి పరిష్కార స్థితిని నిరంతరం సమీక్షిస్తూ ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందిస్తున్నామని తెలిపారు.ఈ సోమవారం స్వీకరించిన 10 ఫిర్యాదుల్లో గొడవలకు సంబంధించినవి 2,భూ వివాదాలకు సంబంధించినవి 4,ఇతర అంశాలకు సంబంధించినవి 4 ఉన్నట్లు అధికారులు తెలిపారు.



# కేజీబీవీల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలి: డీఈఓ విజయ కుమారి


**మహబూబ్ నగర్ ఆగస్టు 17 ( ప్రజా జ్యోతి బ్యూరో )**

: జడ్చర్ల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను జిల్లా విద్యాశాఖ అధికారి విజయ కుమారి సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులతో, సీఆర్‌టీలు మరియు ఉపాధ్యాయులతో మాట్లాడి వారికి అందుతున్న వసతి సౌకర్యాలు, భోజన వసతులపై ఆరా తీశారు. అనంతరం కేజీబీవీ రికార్డులను పరిశీలించిన డీఈఓ పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, వంటగది, వాష్‌రూమ్‌లను పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, రెండు జతల యూనిఫామ్‌లు, బెడ్డింగ్ మెటీరియల్, బంకర్ బెడ్స్ తదితర సౌకర్యాలను అందిస్తోందని డీఈఓ తెలిపారు. నాణ్యమైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందిస్తున్నందున విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదిగి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆమె ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఆదేశించారు. విద్యార్థుల భద్రత, రక్షణ విషయంలో స్పెషల్ ఆఫీసర్‌తో పాటు ఉపాధ్యాయులు ప్రత్యేక బాధ్యత వహించాలని సూచించారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, వంటగది, వాష్‌రూమ్‌లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు ఆరోగ్యకరమైన మరియు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించాలని డీఈఓ విజయ కుమారి ఆదేశించారు.



# విద్యార్థులకు శ్రీరామ్ ఫైనాన్స్ స్కాలర్‌షిప్

**ప్రజాజ్యోతి:**



విద్యార్థుల విద్యాభ్యాసాన్ని ప్రోత్సహించేందుకు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అందిస్తున్న స్కాలర్‌షిప్ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పరిగి బ్రాంచ్ మేనేజర్ విష్ణువర్ధన్ రెడ్డి సూచించారు.విద్యార్థుల విద్యకు ఆర్థిక సహకారం అందించాలనే ఉద్దేశంతో ఈ స్కాలర్‌షిప్‌ను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. 8వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ 2వ సంవత్సరం వరకు చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశానికి అర్హులని పేర్కొన్నారు. గత విద్యా సంవత్సరంలో కనీసం 60 శాతం మార్కులు సాధించి ఉండాలని తెలిపారు.8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు సంవత్సరానికి రూ.4,000, 11, 12వ తరగతి విద్యార్థులకు సంవత్సరానికి రూ.4,500 స్కాలర్‌షిప్‌గా అందజేస్తారని విష్ణువర్ధన్ రెడ్డి వివరించారు.అలాగే 8వ తరగతి నుంచి నిరంతరం స్కాలర్‌షిప్ పొందుతూ, 11, 12వ తరగతుల్లో 60శాతం లేదా అంతకంటే ఎక్కువ మార్కులు సాధించే విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌గా సంవత్సరానికి రూ.5,000 అందించే అవకాశం ఉందన్నారు.అర్హత కలిగిన విద్యార్థులు అవసరమైన ధ్రువపత్రాలతో వివరాలు తెలుసుకుని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ విద్యా సహాయాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగిస్తూ తమ భవిష్యత్తుకు మంచి బాటలు వేసుకోవాలని శ్రీరామ్ ఫైనాన్స్ పరిగి బ్రాంచ్ మేనేజర్ విష్ణువర్ధన్ రెడ్డి కోరారు. మరిన్ని వివరాలకు:విష్ణువర్ధన్ రెడ్డి శ్రీరామ్ ఫైనాన్స్, పరిగి బ్రాంచ్ ☎ 97013 38886

# మండల కేంద్రంలో ప్రజావాణికి 11 ఫిర్యాదులు

**వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్.**

మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి 11దరఖాస్తులు రావడం జరిగిందని రెవెన్యూ సంబంధించిన 9 దరఖాస్తులు మండల మహిళా సమైక్య కార్యాలయం 1 ఎంపీడీవో కార్యాలయం కు1 ఫిర్యాదులు చేయడం జరిగిందని ఎంపీడీవో శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి సోమవారం రోజు మండల కేంద్రంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ప్రజలు రైతులు సద్వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యాలయంలో దరఖాస్తుదారులకు వసతులను అన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ఖజా మైనుద్దీన్ సూపర్డెంట్ రవి నారాయణ మండల వ్యవసాయ అధికారి డా కేశ్వర్ గౌడ్, మండల వైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్, ఏపిఎం మద్దిలేటి, అంగన్వాడి సూపర్వైజర్ రమ్య వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రత్యేక లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలి

## - సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్

**నారాయణపేట ప్రతినిధి ఆగస్టు 17 (ప్రజా జ్యోతి)**

21 నవంబర్ 2026 నా నెగో షియబుల్ ఇన్స్ట్రుమెంట్స్ యాక్ట్ కేసులకు శాశ్వత పరిష్కారం ద్వారా ప్రత్యేక లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవ సంస్థ లీగల్ సర్వీసెస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసే ఈ కార్య క్రమాన్ని కక్షిదారులు ఉపయోగించుకోవాలని లీగల్ సర్వీసెస్ సంస్థ ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు ఆదేశాలనుసారం లీగల్ సర్వీసెస్ సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మరియు సీనియర్, జూనియర్ న్యాయవాదులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవల అధికార సంస్థ తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవల అధికార సంస్థ ఆదేశాల మేరకు, ప్రత్యేక లోక్ అదాలత్ నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్స్ యాక్ట్, 1881లోని సెక్షన్ 138 కింద కేసుల పరిస్కారం కోసం ప్రత్యేకంగా ఒక లోక్ అదాలత్ ని నిర్వహిస్తోంది అన్నారు. 21 నవంబర్ 2026 3వ శనివారం నాడు ఈ కార్యక్రమాని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ప్రత్యేక లోక్ అదాలత్ సందర్బంగా జిల్లా లీగల్ సర్వీసెస్ కార్యదర్శి మాట్లాడుతూ ఈ ప్రత్యేక లోక్ అదాలత్ ను విజయవంతం చేయుటకు గాను వివిధ తేదీలలో న్యాయమూర్తులతో, పోలీసు అధికారులతో, ఇన్సూరెన్స్ అధికారులతోనూ, న్యాయవాదులతోనూ, బ్యాంకు, చిట్ ఫండ్ మేనేజర్లతో, కోర్టు కానిస్టేబుల్స్ తో వేరు వేరు సమావేశాలు ఏర్పాటు చేసాము అని తెలిపారు. ఈ ప్రత్యేక లోక్ అదాలత్ ను విజయవంతం చేయడానికి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సహకరించి, కక్షిదారులకు లోక్ అదాలత్ వలన కలిగే మేలును మీ వంతుగా, మీ శైలిలో తెలపాలని ఈ సందర్భంగా లీగల్



సర్వీసెస్ సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్ కోరారు. రాజీ పడదగు కేసులలోని కక్షిదారులకు నోటీసులు జారీ చేసి రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోనెల విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రాజీపడదగు 152 పెండింగ్ ఉన్న నెగోషి యబుల్ ఇన్స్ట్రుమెంట్స్ చట్టం చెక్కు బౌన్స్ కేసులను గుర్తించి కేసులను పరిష్కరిం చుటకు తగినన్ని ఏర్పాటు చేసి, కక్షిదారుల సమయం వృధా కాకుండా, ఎటువంటి నిరుత్సాహానికి గురికాకుండా, వీలైనంత త్వరలో కేసు పరిష్కరించబడేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ ప్రత్యేక లోక్ అదాలత్ విజయవంతం చేయడంలో ప్రతీ ఒక్కరు తమవంతుగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎటువంటి సలహాలకైనా, సందేహాలకైనా, ఏదేని న్యాయ సహాయం కోసమైనా న్యాయసేవాధికార సంస్థ ను ఆశ్రయించి, ఉచిత న్యాయ సలహాలు, సూచనలు పొందాలని తెలిపారు. లోక్ అదాలత్ పట్ల మరింత సమాచారం కోసం 15100 నంబర్ కు కాల్ చేసి. సందేహాల ను నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లీగల్ సర్వీసెస్ సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి సాయి మనోజ్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కే. అవినాష్, బార్ ప్రెసిడెంట్ దామోదర్ గౌడ్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

# తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ గౌరవ అధ్యక్షులుగా మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్

మొదటిపేజీ తరువాయి

## - పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

## - గ్రామ పంచాయతీల ఖాతాల్లోని నిధుల ఫ్రీజింగ్ ఎత్తివేయాలి



**హైదరాబాద్ / మహబూబ్ నగర్ ఆగస్టు 17 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ గౌరవ అధ్యక్షులుగా మాజీ మంత్రి విరసనోల్ల. శ్రీనివాస్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్పంచుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల అధ్యక్షులకు నియామక పత్రాలను అందజేశారు. అనంతరం తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ గౌరవ అధ్యక్షులుగా వి. శ్రీనివాస్ గౌడ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గ్రామ వ్యవస్థ బలోపేతం అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. గ్రామాలు నిర్వీర్యమైతే రాష్ట్రం కూడా నిర్వీర్యమవుతుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నది గ్రామాలను అభివృద్ధి చేసుకోవడానికేనని, గత పదేళ్లలో గ్రామాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, భవిష్యత్‌లోనూ గ్రామాల అభివృద్ధికి మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ పంచాయతీలకు కేంద్ర నిధులు మాత్రమే వస్తున్నాయని, వాటితో జీతాలు చెల్లిస్తున్నారని తెలిపారు. కేంద్ర నిధులకు సమానంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి మ్యాచింగ్ గ్రాంట్ రావడం లేదని అన్నారు. సర్పంచులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీల బ్యాంకు ఖాతాల్లో నిధులు ఉన్నప్పటికీ వాటిని వినియోగించుకోలేని పరిస్థితి ఉందని, నిధులు ఫ్రీజ్ చేసి ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి నిధులను వినియోగించుకునే అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సర్పంచ్ పదవి ఎంతో బాధ్యతాయుతమైనదని, సర్పంచులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. గ్రామాభివృద్ధిలో సర్పంచ్ కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, గ్రామాలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన హక్కులు, నిధుల కోసం కూడా సర్పంచులు పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత సర్పంచులపై ఉందని పేర్కొన్నారు. త్వరలో అన్ని జిల్లాల జేఏసీ అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ఎదురవుతున్న సమస్యలపై సమగ్రంగా చర్చిస్తామని వి. శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు సుర్వి యాదయ్య మాట్లాడుతూ సర్పంచులకు రావాల్సిన బిల్లుల కోసం ప్రభుత్వంతో పోరాడామని, ఎన్ని బెదిరింపులు, కేసులు ఎదురైనా వెనుకడుగు వేయకుండా పోరాటం చేసి బిల్లులు ఇప్పించేందుకు కృషి చేశామని తెలిపారు. జాతీయ లోక్‌సత్తా సంస్థ అధ్యక్షులు బండారు రామ్మోహన్ రావు మాట్లాడుతూ సర్పంచులకు గ్రామ అభివృద్ధి, పరిపాలన, తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు సుర్వి యాదయ్య, నాగయ్య, మధుసూదన్ రెడ్డి, జాతీయ లోక్‌సత్తా సంస్థ అధ్యక్షులు బండారు రామ్మోహన్ రావు, మల్లయ్య, వెంకటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# షాలెం ఎంబి సంఘంలో నూతన చర్చి షెడ్ ప్రారంభం

**మహబూబ్‌నగర్ ఆగస్టు 17 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

మహబూబ్‌నగర్ నగరంలోని షాలెం ఎంబి సంఘంలో ముడా నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన నూతన చర్చి షెడ్‌ను ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సంఘం అవసరాల కోసం నిర్మించిన నూతన షెడ్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుమ్మాల మమత, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, సిరాజ్ ఖాద్రీ, స్థానిక కార్పొరేటర్ వాణి శ్రీ, కల్వరి ఎంబి చర్చి పాస్టర్ వరప్రసాద్, కౌన్సిల్ సభ్యులు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# భక్తి శ్రద్ధలతో నాగుల పంచమి పూజలు

**చిన్నంబావి, ఆగస్టు 17 (ప్రజాజ్యోతి)**

శ్రావణమాసం నాగుల చవితి, పంచమి పర్వదినాలను పురస్కరించుకుని చిన్నంబావి మండలంలోని పలు గ్రామాల్లో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు, నూతన దంపతులు పుట్టల వద్ద నాగదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించి పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. నల్లనువ్వుల ముద్దలతో పూజలు నిర్వహించి సర్పదోషాలు తొలగి కుటుంబంలో సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థించారు.అనంతరం సమీపంలోని ఆలయాలకు వెళ్లి శివుడు, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పండుగ సందర్భంగా ఆలయాల వద్ద భక్తుల రద్దీ నెలకొంది.



# మండల టాపర్ గ్రేసికి తహసీల్దార్ అభినందనలు - స్టడీ చైర్,స్టడీ ప్యాడ్ అందజేత

**గద్వాల ఆగస్టు 17(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

మార్చి 2026లో నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో మల్దకల్ మండల టాపర్‌గా నిలిచిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,మల్దకల్ విద్యార్థిని గ్రేసిని తహసీల్దార్ ఝాన్సీ అభినందించారు.ఈ సందర్భంగా గ్రేసి తండ్రి రాజశేఖర్‌కు స్టడీ చైర్,స్టడీ ప్యాడ్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్ సమక్షంలో తహసీల్దార్ అందజేశారు. విద్యార్థిని గ్రేసి ఇదే స్ఫూర్తితో ఉన్నత విద్యను అభ్యసించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆమె ఆకాంక్షించారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడం ద్వారా వారిలో మరింత ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని తహసీల్దార్ పేర్కొన్నారు.



# ధన్వాడ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా కొండాపూర్ సర్పంచ్ భీమన్న

**ధన్వాడ ఆగస్టు 17(ప్రజా జ్యోతి)**



ధన్వాడ మండల సర్పంచుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు కొండాపూర్ గ్రామ సర్పంచ్ భీమయ్యను సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యన్మోనిపల్లి సర్పంచ్ బోయ నగేష్‌ను ఉపాధ్యక్షుడిగా బుడ్డమర్రి తండా సర్పంచ్ అనితను ప్రధాన కార్యదర్శిగా నీల్లా నాయక్‌ను కార్యదర్శిగా ఎన్నుకున్నారు ధన్వాడ మండలంలోని సర్పంచులు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు భీమయ్య మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి సర్పంచులంతా సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సర్పంచుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం సంఘం తరఫున నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు నూతన కార్యవర్గం ఎన్నిక పట్ల పలువురు సర్పంచులు హర్షం వ్యక్తం చేశారు నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు

# గ్రామస్తుల మానవత్వం.. అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

**గండీడ్, ప్రజాజ్యోతి:**

గండీడ్ మండలం పగిడ్యాల్ గ్రామానికి చెందిన బస్పల్లి వెంకటమ్మ మృతి చెందడంతో ఆమె అంత్యక్రియల కోసం గ్రామస్తులు మానవత్వంతో స్పందించి ఆర్థిక సహాయం అందించారు. వెంకటమ్మ మృతి విషయం గ్రామాభివృద్ధి గ్రూపులో పోస్టు చేయడంతో పలువురు గ్రామస్తులు స్పందించి తమకు తోచినంత మొత్తాన్ని విరాళంగా అందించారు.ఈ విధంగా మొత్తం రూ.9,000 జమ కాగా, ఆ మొత్తాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆపద సమయంలో కుటుంబానికి అండగా నిలిచిన గ్రామస్తుల సేవాభావాన్ని పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ఎంపీటీసీ నీరటి కృష్ణయ్య, జగ్గంపల్లి నారాయణ, పెద్దపురం హరిప్రసాద్ గౌడ్, వార్డు మెంబర్ కావలి బాలయ్య, టీఆర్ఎస్ పార్టీ యువజన అధ్యక్షుడు గుట్టమీది కృష్ణారెడ్డి (కిట్టు), ఉమ్మడి పాలమూరు జిల్లా అంబేద్కర్ సంఘం అధ్యక్షులు పగిడ్యాల్ బోరు కృష్ణయ్య టీచర్, బస్పల్లి పెంటయ్య, బంగారి కృష్ణయ్య, తోక కొండయ్య, నీరటి లాలయ్య, బంటు వెంకటయ్య, బంటు శ్రీనివాస్ మెకానిక్, బంగారి భీమయ్య, నుసులై శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



# మొట్ట మొదటి ప్రజావాణికి మూడు దరఖాస్తులే చిన్నంబావి

**చిన్నంబావి, ఆగస్టు 17 (ప్రజా జ్యోతి)**

ప్రజల సమస్యలను స్థానికంగానే పరిష్కరించాలనే ఉద్దేశంతో మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మూడు దరఖాస్తులు మాత్రమే అందాయి. ఈ విషయాన్ని ఎంపీడీవో సుర్ణ ఆదర్శ్‌గౌడ్ వెల్లడించారు. జిల్లా కేంద్రానికి వెళ్లి ప్రజలు ఇబ్బందులు పడకుండా మండల కేంద్రంలోనే ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడానికి ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కేంద్రంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు. వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు పంపించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో రామస్వామి, ఏపీవో.ధనుంజయరాజుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# "ముడుమాల్ నిలువు రాళ్ల వద్దకు ఏ ఎస్ ఐ ఆర్చియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా ,డిపార్ట్మెంట్ ఆఫ్ హెరిటేజ్

## తెలంగాణదక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ సంయుక్త అధ్యయనం- కేంద్రానికి నివేదిక

**కృష్ణ ఆగస్టు 17 (ప్రజా జ్యోతి)**

ముడుమాల్‌లోని మెగాలిథిక్ మెన్‌హిర్స్ ప్రాంతాన్ని పరిశీలించేందుకు పురావస్తు, వారసత్వ రంగాలకు చెందిన నిపుణులు రేపు, 18 ఆగస్టు 2026 మధ్యాహ్నం 12 గంటలకు ముడుమాల్ నిలువురాళ్ల స్టడీ సర్వే నిర్వహిస్తారు ,తదుపరి కృష్ణ నది ఒడ్డునవున్న శివాలయం , మఠము మరియు గ్రామస్తులను కలిసి కథనాలు తెలుసుకొని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిలువురాళ్ల విశిష్టత తెలుపుతారు. ఈ కార్యక్రమంలో దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ ,ప్రొఫెసర్ మణికొండ వేదకుమార్, ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏ ఎస్ ఐ) హైదరాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ ఆర్కియాలజిస్ట్ శ్రీ నిహిల్ దాస్, డిప్యూటీ సూపరింటెండెంట్ డా. రోహిణి పాండే అంబేకర్, ప్రొఫెసర్ కె. పి. రావు,డొసియర్ ఎక్స్పర్ట్ మరియు తెలంగాణ హెరిటేజ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పాల్గొంటారు.

# లక్కరు దొడ్డిలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన ఉత్సవాలు

**నర్వ ఆగస్టు 17 ప్రజా జ్యోతి**

నారాయణపేట జిల్లా నర్వ మండలములోని లక్కర్ దొడ్డి గ్రామంలో జరుగుతున్న లిశ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ ధ్వజస్తంభం నాభి శిల బొడ్రాయి ప్రతిష్టాపన మహోత్సవ సోమవారం జరిగాయి, ఈ ఉత్సవాల కార్యక్రమానికి. గౌరవ గ్రామ సర్పంచ్ శ్రీ సుశీలదేవన్న పంచాయతీ పాలకవర్గం సభ్యులు మరియు గ్రామ పెద్దల ఆహ్వానం మేరకు మా గ్రామ పెద్దలు గౌరవ శ్రీ కొత్తకోట సుధాకర్ రెడ్డి గారిత. అన్ని గ్రామాల గౌరవ సర్పంచులు మరియు ఆత్మకూర్ మండల మార్కెట్ యార్డు కమిటీ వైస్ చైర్మన్ డి.కృష్ణారెడ్డి , కాంగ్రెసు పార్టీ మండల అధ్యక్షుడు బీసం చెన్నయ్య సాగర్ , మండల సీనియర్ నాయకులు జగన్ మోహన్ రెడ్డి గారితో పాటు లక్కరు దొడ్డి గ్రామ పెద్దలు కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.



# ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలి

**- జీవో నెం. 97ను వెంటనే ఉపసంహరించుకోవాలి: ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కె. లక్ష్మణ్**

**మహబూబ్ నగర్ ఆగస్టు 17 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్లేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం. 97ను వెంటనే ఉపసంహరించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కె. లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు పేద, మధ్యతరగతి విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలను మరింత బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం, వాటిని ప్రైవేటు వ్యక్తులు, సంస్థలకు అప్పగించే విధానాలను తీసుకురావడం విద్యార్థుల భవిష్యత్తుకు తీవ్ర నష్టం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేటీకరణ జరిగితే విద్యార్థులపై ఫీజుల భారం పెరిగే అవకాశం ఉందని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు సాంకేతిక విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని లక్ష్మణ్ అన్నారు. ఇప్పటికే ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు, అధ్యాపకుల కొరత వంటి సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించకుండా ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేయడం సరికాదన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు ప్రైవేటుపరమైతే పేద, మధ్యతరగతి విద్యార్థులకు తక్కువ ఖర్చుతో డిప్లొమా విద్య అందుబాటులో లేకుండా పోయే ప్రమాదం ఉందని





ఆవేదన వ్యక్తం చేశారు. విద్యను వ్యాపారంగా మార్చే విధానాలను ఏఐఎస్ఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. జీవో నెం. 97ను వెంటనే ఉపసంహరించుకోకపోతే విద్యార్థులను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతామని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కె. లక్ష్మణ్ హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, నాయకులు నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలి

**- ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ జానకి**

**మహబూబ్ నగర్ ఆగస్టు 17 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ దరావత్ జానకి ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలను ఎస్పీకి ప్రత్యక్షంగా వివరించి వినతిపత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ ప్రతి ఒక్కరి సమస్యను ఓపికగా విని, వాటి పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా ప్రతి ఫిర్యాదుపై ఎలాంటి జాప్యం లేకుండా చట్టబద్ధమైన విధానంలో విచారణ చేపట్టి సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని ఎస్పీ జానకి తెలిపారు. ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా, చట్టబద్ధమైన విధానంలో పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



# పండుగలను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలి

**- మత పెద్దలతో శాంతి కమిటీ సమావేశంలో వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పయ్య**

**మహబూబ్ నగర్ ఆగస్టు 17 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

జిల్లా ఎస్పీ దరావత్ జానకి ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పయ్య ఆధ్వర్యంలో హిందూ, ముస్లిం మత పెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ అప్పయ్య మాట్లాడుతూ రాబోయే పండుగలను ప్రజలందరూ సోదరభావంతో, పరస్పర గౌరవంతో శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. పండుగల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. మతపరమైన అంశాల్లో ఎలాంటి అపోహలు, పుకార్లను నమ్మకుండా సంయమనం పాటించాలని, ఇతర మతాల మనోభావాలను గౌరవిస్తూ పండుగలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, వాటిని ఇతరులకు ఫార్వర్డ్ చేయకుండా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ అన్ని చర్యలు తీసుకుంటుందని, ప్రజల సహకారంతో పండుగలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు కృషి చేస్తామని ఇన్‌స్పెక్టర్ అప్పయ్య తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న హిందూ, ముస్లిం మత పెద్దలు శాంతియుత వాతావరణం కోసం పోలీస్ శాఖకు తమ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.



# తులం బంగారం దేవుడెరుగు..!?

మొదటిపేజీ తరువాయి

- కనీసం పేదింటి "కళ్యాణమైన" జరిపించండి..
- కొల్లాపూర్ నియోజక వర్గ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి డిమాండ్
- చిన్నంబావి చౌరస్తాలో బిఆర్ఎస్ ధర్నా - ఆందోళన
- ఆందోళనకు పెద్ద ఎత్తున తరలివచ్చిన మండల బిఆర్ఎస్ శ్రేణులు



**చిన్నంబావి ఆగస్టు 17 (ప్రజా జ్యోతి)**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక పేదింటి ఆడపడుచుల కళ్యాణానికి తులం బంగారం ఇస్తామని ప్రగల్భాలు పలికిన ప్రభుత్వ పెద్దలు ఇప్పుడు ఏకంగా కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ లకే ఎసరు పెడుతున్నారంటూ రాష్ట్ర ప్రభుత్వ తీరుపై కొల్లాపూర్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలపై హైకోర్టు స్టే విధించడం దీనినీ ఎత్తివేయకుండా ప్రభుత్వం సంసిద్ధంగా లేకపోవడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి ప్రభుత్వ తీరును తప్పుపట్టారు. సోమవారం వనపర్తి జిల్లా చిన్నంబావి మండల చౌరస్తాలో భారత రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపు మేరకు పార్టీ శ్రేణులు ధర్నాకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. చిన్నంబావి మండలంలో ప్రభుత్వ తీరుకు నిరసనగా ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ధర్నాను ఉద్దేశించి మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. "నూరు అబద్ధాలైన ఆడి ఒక పెళ్లి చేయాలని" ఆనాడు పెద్దలు నానుడి అంటూ ఉండేవారని పేద ఇంటి పిల్లలకు పెళ్లి చేయడానికి కన్న తల్లిదండ్రులు పడుతున్న తాపత్రయం ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని 2014లో ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ 51 వేల రూపాయల పారితోషకంతో కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లాంటి బృహత్తరమైన పథకాలను ప్రవేశపెట్టారని, అలాగే పేదల అవసరాలకు అనుగుణంగా వారి ఇబ్బందులు గుర్తించి వాటిని లక్ష రూపాయలకు పైగా.కేటాయించారని గుర్తు చేశారు. కళ్యాణ లక్ష్మి పై ఎవరో హైకోర్టులో రెడ్ పిటిషన్ వేగా కోర్టు ఐదు సందర్భాలలో ప్రభుత్వాన్ని సంజయ్సా కూరగా ప్రభుత్వ లీడర్ ఎవరు తగువిధంగా స్పందించలేదని మాజీ ఎమ్మెల్యే ఆరోపించారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే పేద ప్రజల కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలను ఎతివేసేందుకు కుట్ర చేస్తుందని అందుకే ఉన్నత న్యాయస్థానానికి సమాధానం చెప్పుకోలేకపోయిందని అందుకే ఈ పథకాలపై స్టే విధించడం జరిగిందని బీర వర్షావర్ధన్ రెడ్డి  ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు కల్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని ఎన్నో ప్రగల్భాలు పలికారని రెండున్నర సంవత్సరాలు ప్రభుత్వం వచ్చి పాలన కొనసాగుతున్న తులం బంగారం ఇవ్వకపోగా కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లాంటి బృహత్తర పథకాలను ఎత్తివేసేందుకు కుట్ర పన్నుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లాంటి పథకాలు సామాజిక అంశంతో ముడిపెట్టి చూడాలని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ప్రభుత్వానికి అప్పీల్ చేశారు. ఎందుకంటే పేద కుటుంబాల్లో ఆడపిల్లలు కన్న తల్లిదండ్రులకు భారం అని భావించి ఆడపిల్లలను అంగట్లో అమ్మివేస్తున్నారని చదువులు చదివిపించడం లేదని ఇలాంటి సమయంలో ఆడపిల్ల పుట్టగానే కెసిఆర్ ప్రభుత్వం ఆనాడు కెసిఆర్ కిట్ ద్వారా 13 వేల రూపాయలు ఇస్తుందని ఆ తర్వాత విద్య తదితర పథకాలలో ప్రాధాన్యత ఇస్తుందని పెళ్లి చేసి పంపే వరకు కళ్యాణ లక్ష్మి అందజేస్తుందని మాజీ ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఆడపిల్ల కోసం గత ప్రభుత్వం ఎంతో తాపత్రయపడి వారి భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని అనేక పథకాలు రూపొందించింది అని గుర్తు చేశారు. ప్రభుత్వం కోర్టు అంశంలో వెంటనే స్పందించి విధంగా ప్రభుత్వం ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో మహిళలకు 2500. రూపాయలు  ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని పేద వ్యాపారులపై అధికారుల తీరుపై హర్షవర్ధన్‌రెడ్డి ఆగ్రహం.చిన్నంబావిలో 1520 ఏళ్లుగా దుకాణాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న పేద వ్యాపారుల విషయంలో అధికారుల తీరు సరికాదని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దుకాణాల ముందు రాళ్లు, మొరం పోసి పేదల జీవనోపాధికి అడ్డంకులు సృష్టించడం దారుణమన్నారు. పేదల పొట్ట కొట్టి ఎవరూ రాజకీయంగా ఎదగలేరని స్పష్టం చేశారు.లా అండ్ ఆర్డర్ కాపాడాల్సిన పోలీసులు పేద వ్యాపారులను సెటిల్‌మెంట్లకు పిలవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. చట్టం పేదలకేనా? అని నిలదీశారు. భయపెట్టి, ఒత్తిడి తెచ్చి సమస్యలను పరిష్కరించాలనుకోవడం ప్రజాస్వామ్యంలో సరికాదన్నారు. భూములు దేవాదాయ శాఖకు చెందినవైతే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, అంతేతప్ప పేదలపై దౌర్జన్యం చేయొద్దని పోలీసు అధికారులకు సూచించారు. బాధిత వ్యాపారులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.210 మంది నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలి జీవో 98 కింద అర్హులైన 210 మంది నిర్వాసితులకు వెంటనే ఉద్యోగాలు కల్పించాలని హర్షవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. తన హయాంలో అర్హుల జాబితాను సిద్ధం చేసి, ఉద్యోగాల కల్పనకు సంబంధించిన ప్రక్రియను ముందుకు తీసుకెళ్లామని తెలిపారు. ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయిన ప్రక్రియను ప్రభుత్వం వెంటనే పునఃపరిశీలించి, అర్హులైన నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు.అలాగే కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో పాటు పెండింగ్‌లో ఉన్న సంక్షేమ పథకాలన్నింటినీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి, ప్రభుత్వాన్ని ప్రజాక్షేత్రంలో నిలదీస్తామని హర్షవర్ధన్‌రెడ్డి హెచ్చరించారు.ఈ కార్యక్రమానికి నియోజకవర్గ నలుమూలల నుండి ఈ ధర్నా కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గజ్జల ఈదన్న , మాజీ జెడ్పిటిసి కేసిరెడ్డి వెంకటరమణ,చిన్నారెడ్డి, మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ, నాయకులు వడ్డేమాన్ రామకృష్ణ  సర్పంచులు,మాజీ ఎంపీపీలు, , మాజీ ఎంపీటీసీలు, వివిధ మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ యువత, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సంపంగి మద్దిలేటి బిసన్న విజయ్ కుమార్ ఆటో తగరం కురుమయ్య, ఉపసర్పంచ్ కురుమయ్య, మద్దిలేటి గంగేశ్వర్ గౌడ్, తదితరులు  పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియలో  పారదర్శకతకు ప్రాధాన్యం

## - 84 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ పరిశీలించిన ఎస్పీ డి. జానకి

**మహబూబ్‌నగర్, ఆగస్టు 17 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో ఆర్టీసీ డ్రైవర్, శ్రామిక్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జరుగుతున్న ఈ ప్రక్రియను జిల్లా ఎస్పీ దరావత్ జానకి,  సోమవారం పరిశీలించారు. ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్ నుంచి 21 మంది, నాగర్‌కర్నూల్ నుంచి 21 మంది, వనపర్తి నుంచి 14 మంది, గద్వాల నుంచి 14 మంది, నారాయణపేట నుంచి 14 మంది చొప్పున మొత్తం 84 మంది అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తున్నారు. వీరిలో 64 మంది డ్రైవర్ పోస్టులకు, 20 మంది శ్రామిక్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ జానకి అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన, ధ్రువీకరణ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. వెరిఫికేషన్ ప్రక్రియను నిబంధనల ప్రకారం, సక్రమంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అభ్యర్థుల ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, ఏఓ రుక్మిణీ భాయ్, ఆర్ఐలు కృష్ణయ్య, నగేష్, అశోక్ కుమార్‌తో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఖేలో ఇండియా క్రీడాకారులతో అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని ముఖాముఖి

## - ఫుట్‌బాల్‌లో ప్రతిభను చాటుతూ ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

**మహబూబ్‌నగర్, ఆగస్టు 17**

**( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ఖేలో ఇండియా కార్యక్రమంలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా ఫుట్‌బాల్ జట్టు క్రీడాకారులతో అసిస్టెంట్ కలెక్టర్ ట్రైనీ ఈ. సాయి శివాని ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని వారితో ఆత్మీయంగా ముచ్చటించారు. ఖేలో ఇండియా ఇంప్లిమెంటేషన్ ఆఫీసర్, డీవైఎస్ఓ మహబూబ్‌నగర్ జె. రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని క్రీడాకారుల శిక్షణ, క్రీడా ప్రస్థానం, వారి లక్ష్యాలు, ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఫుట్‌బాల్‌పై వారికి ఉన్న ఆసక్తి, భవిష్యత్తులో సాధించాలనుకుంటున్న విజయాల గురించి తెలుసుకుని క్రీడాకారులను ప్రోత్సహించారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు శారీరక, మానసిక దృఢత్వానికి దోహదపడతాయని ఆమె అన్నారు. క్రీడాకారులు క్రమం తప్పకుండా సాధన చేస్తూ తమ ప్రతిభను మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న క్రీడా అవకాశాలను



సద్వినియోగం చేసుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేయాలని సాయి శివాని క్రీడాకారులకు సూచించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో ముందుకు సాగితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఆమె అన్నారు. ఖేలో ఇండియా కార్యక్రమం ద్వారా ప్రతిభ కలిగిన యువ క్రీడాకారులను గుర్తించి వారికి అవసరమైన శిక్షణ, ప్రోత్సాహం అందించేందుకు కృషి చేస్తున్నామని కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖేలో ఇండియా ఇంప్లిమెంటేషన్ ఆఫీసర్, డీవైఎస్ఓ జె. రాజశేఖర్ రెడ్డి, కోచ్‌లు, సిబ్బంది, మహబూబ్‌నగర్ ఖేలో ఇండియా ఫుట్‌బాల్ జట్టు క్రీడాకారులు పాల్గొన్నారు.



# మండల స్థాయి ప్రజావాణికి 72 దరఖాస్తులు

## - ప్రజల సమస్యలను స్థానికంగానే సత్వరం పరిష్కరించాలి : కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, ఆగస్టు 17 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ప్రజల సమస్యలను స్థానికంగానే పరిష్కరించాలనే ఉద్దేశంతో జిల్లాలోని అన్ని మండలాల్లో సోమవారం నిర్వహించిన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాలకు ప్రజల నుంచి మొత్తం 72 దరఖాస్తులు అందినట్లు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 16 మండలాల్లో మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాలను నిర్వహించి ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. మండల స్థాయిలోనే ప్రజల సమస్యలను అధికారులు స్వీకరించి, సంబంధిత శాఖల ద్వారా సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

**మండలాల వారీగా దరఖాస్తుల వివరాలు:**

అడ్డాకల్ 1, బాలానగర్ 2, భూత్పూర్ 1, చిన్నచింతకుంట 1, దేవరకద్ర 7, గండీడ్ 15, హన్వాడ 3, జడ్చర్ల 16, కోయిలకొండ 3, కౌకుంట్ల 3, మహబూబ్‌నగర్ రూరల్ 1, మిడ్జిల్ 3, మహ్మదాబాద్ 5, మూసాపేట 4, నవాబ్‌పేట 6, రాజాపూర్ 1 చొప్పున దరఖాస్తులు అందాయి. ఆయా మండలాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాలకు సంబంధిత మండల స్థాయి అధికారులు హాజరై ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రతి సోమవారం నిర్వహించే మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి వివిధ శాఖలకు చెందిన మండల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. ప్రజల నుంచి అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు.

# పేదింటి ఆడ బిడ్డల ఆశలపై కాంగ్రెస్ "కత్తెర "

## కళ్యాణ లక్ష్మి, శాది ముబారక్ పథకాల పునరుద్ధరించాలని బి ఆర్ శ్రేణుల ధర్నా

**మహమ్మదాబాద్ ఆగష్టు 17(ప్రజా జ్యోతి )**

కళ్యాణ లక్ష్మి, శాది ముబారక్ పథకాల అమలులో కాంగ్రెస్ పార్టీ లబ్ధిదారులకు అన్యాయం చేసే దిశగా అడుగులు వేస్తోందని ఆరోపించారు. సోమవారం నంచర్ల గేట్ చౌరస్తా లో బి ఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా నరసన కార్యక్రమం చేపట్టారు. పేదింటి ఆడ బిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉదేశ్యం తో కే సి ఆర్ ప్రవేశ పెట్టి పదేళ్ల పాటు అమలు చేస్తే ప్రస్తుత ప్రభుత్వం కోర్టు లో సరైన వాదనలు వినిపించక పోవడం వల్ల పథకాల పై ఆంక్షలు వచ్చే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. మహిళలకు నెలకు 2,500 రూపాయల ఆర్థిక సాయం అందిస్తామని ఎన్నికల సమయం లో ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎకరాకు 15000 రూపాయల ఆర్థిక సాయం రైతు భీమా వంటి పథకాలను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పథకాల ద్వారా లబ్ధి పొందాల్సిన అర్హులైన కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని బి ఆర్ ఎస్ నాయకులు ఆరోపించారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిశీలించి ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమం లో మాజీ జడ్పీటీసి ఎం శ్రీనివాస్ రెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు డి గోపాల్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బిక్షపతి, పి వెంకట్రాంరెడ్డి, మాజీ జడ్పీ టీసి వెంకటయ్య, జిన్నారం గోపాల్, కృష్ణయ్య గౌడ్ అంజిలయ్య గౌడ్, చింత కింది కేశవులు, అశోక్ గౌడ్, బి రాములు, నర్సప్ప, హనుమతు తదితర కార్య కర్తలు, నాయకులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కు ఆల్పాహారం తో పాటు పౌష్టికాహారం అందిస్తున్న గ్రామ సర్పంచ్

## స్వచ్ఛందంగా పౌష్టికాహారం అందిస్తూ ఆదర్శనంగా నిలుస్తున్న సర్పంచి

**మహమ్మదాహబాద్ ఆగష్టు 17(ప్రజా జ్యోతి )**

మహమ్మదాబాద్ మండలం చౌదర్పల్లి గ్రామ ప్రాతమీకోన్నత పాఠ శాల విద్యార్థులకు ప్రతి రోజు ఆల్ఫాహారం అందిస్తామని అన్నారు. సోమవారం రోజు మండల నాయకులు, గ్రామస్తులు, ఉపాధ్యాయుల సమక్షం లో సర్పంచి అనూష సతీష్ రెడ్డి విద్యార్థులకు ఆల్ఫాహారాన్ని అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం తో పాటు అదనంగా పౌష్టికాహారం అందిస్తా మని అన్నారు ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడు తూ ప్రభుత్వ పాఠ శాలలో చదివే విద్యార్థుల ఆరోగ్యం, చదువు పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని ఇక ముందు వారికి కావలసిన మరిన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసి ఎలాంటి లోటు రాకుండా చూసుకుంటామని, ఈ ఆల్పాహారం అందచేత నిరంతరం కొన సాగిస్తామని అన్నారు. సర్పంచ్ చేస్తున్న ఈ సేవా కార్యక్రమం పట్ల విద్యార్థుల తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు, ఈ కార్యక్రమం లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కే ఎం నారాయణ, సతీష్ రెడ్డి,మాజీ ఎంపీ పి శాంతి రంగ్యా, కమతం మమతా రెడ్డి, విశ్వ హిందూ పరిషత్ వేణు గౌడ్,వార్డ్ మెంబర్లు కేశవులు, ఆనంద్, ఈ సూరి యాదయ్య, శావుకు మధు, పల్ల నరేష్, శావుకు లాలు జోగు నర్సిములు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.



# పూలే, అంబేడ్కర్ ఆశయాలే సమాజానికి మార్గదర్శకం

## - మహనీయుల జీవిత సందేశాన్ని ఆచరణలో పెట్టడమే నిజమైన నివాళి :

## ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్, ఆగస్టు 17 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చూపిన విద్య, సమానత్వం, సామాజిక న్యాయం మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని విద్యుత్ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలను సోమవారం ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ఆవిష్కరించారు. అనంతరం మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ పూలే, అంబేడ్కర్ వంటి మహనీయుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం సాధన కోసం వారి అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పూలే, అంబేడ్కర్ తమ జీవితాలను అణగారిన వర్గాల అభ్యున్నతికి అంకితం చేశారని అన్నారు. విద్య, జ్ఞానం ద్వారానే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని వారు విశ్వసించారని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు చదువును జీవితంలో ప్రధాన లక్ష్యంగా చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. "విగ్రహాలకు పూలమాలలు వేయడంతో నివాళి పూర్తికాదు.. మహనీయుల ఆశయాలను జీవితంలో ఆచరణలో పెట్టినప్పుడే వారికి నిజమైన గౌరవం" అని యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పేద, అణగారిన వర్గాల పిల్లలకు విద్య అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. పిల్లలకు సరైన మార్గదర్శకత్వం, ప్రోత్సాహం, విద్య అందిస్తే వారు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యలో ముందుకు వెళ్లేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు.

**మహబూబ్‌నగర్‌లో విద్యారంగానికి పెద్దపీట :**

మహబూబ్‌నగర్ నగరంలో విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ట్రిపుల్ ఐటీ, ఇంజనీరింగ్ కళాశాల, లా కళాశాల వంటి విద్యాసంస్థలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ట్రిపుల్ ఐటీలో మహబూబ్‌నగర్ విద్యార్థులకు గణనీయమైన సంఖ్యలో సీట్లు సాధించామని, అందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉన్నారని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. రాబోయే ఐదేళ్లను విద్యార్థుల భవిష్యత్తు కోసం అంకితభావంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. పిల్లలకు పుస్తకాలు, విద్యా సహాయం, కౌన్సెలింగ్ అందించడంతో పాటు ఉన్నత విద్యా అవకాశాలపై అవగాహన కల్పించే కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఇతర అణగారిన వర్గాల సమస్యలను కేవలం చర్చలకే పరిమితం చేయకుండా వాటికి పరిష్కార మార్గాలను అన్వేషించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. మహనీయులు చూపిన సామాజిక చైతన్యం, పోరాట పటిమ, సమస్యలను అధ్యయనం చేసి పరిష్కారాలను సూచించే దృక్పథాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని అన్నారు. పూలే చూపిన విద్యా మార్గం, అంబేడ్కర్ చూపిన రాజ్యాంగ మార్గం మనందరికీ శాశ్వత మార్గదర్శకాలని, పేద, అణగారినవర్గాల పిల్లలకు ఉన్నత విద్యా అవకాశాలు కల్పించడమే మహనీయులకు ఇచ్చే నిజమైన నివాళి అని ప్రభుత్వ విప్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, వినోద్ కుమార్, సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, సిరాజ్ ఖాద్రీ, సాయిబాబా, చీఫ్ ఇంజనీర్ బాలస్వామి, ఎస్ఈ భీమా నాయక్, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# పెద్దదగడ గ్రామంలో 14 ఎకరాల భూమికి అక్రమ పట్టాలు?

- మోకపై భూమి లేకున్నా.. పట్టాదారు పాసుపుస్తకాలు జారీ
- దొంగపట్టాలు చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి
- మదనగోపాలచారి వారసురాలు కే కే ఏ శాంతి, ప్రశాంతి



**చిన్నంబావి ఆగస్టు 17 (ప్రజా జ్యోతి)**

చిన్నంబావి మండలం పెద్ద దగడ గ్రామ శివారులోని సర్వే నంబర్లు 445 నుంచి 453 వరకు ఉన్న సుమారు 14 ఎకరాల వ్యవసాయ భూమి విషయంలో అధికారులు అక్రమంగా పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేశారంటూ మదనగోపాలచారి వారసురాలు కేకే ఏ శాంతి, ప్రశాంతి ఆరోపించారు. 1954 నుంచి 2023 వరకు సదరు భూమికి సంబంధించిన రెవెన్యూ రికార్డుల్లో శాలి ఇనాందారు కేకే ఏ అలివేలమ్మ భర్త గోపాలచారి పేరు నమోదై ఉందని తెలిపారు. ఆయన అనంతరం వారసుడైన మదనగోపాలచారి పేరు రికార్డుల్లో నమోదైందన్నారు. మదనగోపాలచారి మరణానంతరం ఆయన భార్య కేకే ఏ చుడామణి 2018లో రికార్డుల్లో వారసుల పేర్లు నమోదు చేయాలని దరఖాస్తు చేసుకున్నారని, ఫారం-1, ఫారం-2 నోటీసులు కూడా జారీ అయ్యాయని పేర్కొన్నారు. అయితే మోకపై భూమిని సాగు చేస్తున్న తమ కుటుంబ సభ్యుల పేర్లను రికార్డుల్లో నమోదు చేయకుండా అధికారులు కాలయాపన చేశారని శాంతి, ప్రశాంతి ఆరోపించారు. 2022లో రికార్డుల్లో పేర్లు లేని, మోకపై భూమి లేని వ్యక్తులకు వారసత్వ హక్కులు కల్పించి పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేశారని విమర్శించారు. ఈ వ్యవహారంపై కోర్టులో కేసు కొనసాగుతున్నప్పటికీ, కోర్టు పరిధిలో ఉన్న అంశాన్ని పక్కనపెట్టి ఇతరుల పేర్లను రికార్డుల్లో నమోదు చేయడం అన్యాయమన్నారు. తమ కుటుంబాన్ని పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం, కోర్టుల చుట్టూ తిప్పుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాతల కాలం నుంచి భూమిని సాగు చేసుకుంటూ జీవిస్తున్న తమపై కొందరు కుటుంబ సభ్యులు అక్రమంగా హక్కులు పొందేందుకు ప్రయత్నిస్తున్నారని శాంతి, ప్రశాంతి ఆరోపించారు. కొన్నేళ్లుగా తమను పట్టించుకోని వారు ఇప్పుడు వారసులమంటూ 14 ఎకరాల భూమిపై హక్కులు కోరుతున్నారని అన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, మోకపై భూమి లేకుండా అక్రమంగా పట్టాలు పొందిన వారి పేర్లను రికార్డుల నుంచి తొలగించాలని ఆమె డిమాండ్ చేశారు. అలాగే ఈ వ్యవహారంలో అధికారుల నిర్లక్ష్యం లేదా అక్రమాలకు తావున్నట్లు తేలితే బాధ్యులపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. తమ కుటుంబానికి చెందిన భూమిపై న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని కేకేఏ. శాంతి, ప్రశాంతి స్పష్టం చేశారు.

# విద్య ఒక్కటే జీవితాన్ని మార్చే శక్తివంతమైన ఆయుధం

## పేదరికం విద్యార్థుల భవిష్యత్తుకు అడ్డంకి కాకూడదు: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్, ఆగస్టు 17 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

విద్య ఒక్కటే మనిషి జీవితాన్ని మార్చే శక్తివంతమైన ఆయుధమని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. చదువు ఉంటే జీవితంలో సాధించలేనిది ఏదీ ఉండదని, విద్య కేవలం ఉద్యోగం సాధించేందుకు మాత్రమే కాకుండా ఆలోచనా విధానం, వ్యక్తిత్వం, కుటుంబ భవిష్యత్తు, సమాజ అభివృద్ధిని మార్చే గొప్ప శక్తి అని పేర్కొన్నారు. ఇటీవల అమెరికా తెలుగు అసోసియేషన్ (ఆట) అందించిన కమ్యూనిటీ సర్వీస్ అవార్డును పురస్కరించుకుని జీకే ఇంజనీరింగ్ కళాశాలలో ఆల్ మదీనా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం యెన్నం శ్రీనివాస్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో శాశ్వతమైన మార్పు తీసుకురావాలంటే విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థుల్లో కూడా ఎంతో ప్రతిభ దాగి ఉంటుందని, వారికి సరైన ప్రోత్సాహం, మార్గదర్శకత్వం, విద్యా వనరులు అందిస్తే ఉన్నత స్థాయికి ఎదగగలరని తెలిపారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రైవేట్, కార్పొరేట్ విద్యార్థులతో సమానంగా పోటీ పడేలా అవసరమైన విద్యా వాతావరణాన్ని కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, వారికి సరైన దిశానిర్దేశం చేయడం ద్వారా ఉన్నత విద్య, ఉద్యోగాలు, పోటీ పరీక్షల్లో రాణించేలా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. పేదరికం విద్యార్థుల భవిష్యత్తుకు అడ్డంకి కాకూడదని, ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా కృషి చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

**విద్యా రంగంలో మహబూబ్‌నగర్‌ను ముందుకు తీసుకెళ్తాం:**

మహబూబ్‌నగర్ నియోజకవర్గాన్ని విద్యా రంగంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నామని యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచడం, విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంపొందించడం, ఉన్నత విద్యపై అవగాహన కల్పించడం, ప్రతిభావంతులైన విద్యార్థులకు అవసరమైన సహకారం అందించడం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా కష్టపడాలని సూచించారు. ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగితే ఎలాంటి పరిస్థితుల్లోనైనా విజయం సాధించవచ్చని అన్నారు. విద్యాభివృద్ధికి చేస్తున్న కృషిని గుర్తించి అమెరికా తెలుగు అసోసియేషన్ కమ్యూనిటీ సర్వీస్ అవార్డు అందించడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ అవార్డును వ్యక్తిగత గౌరవంగా కాకుండా విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యా రంగంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ




దక్కిన గౌరవంగా భావిస్తున్నానన్నారు. "ఒక కుటుంబాన్ని మార్చేది ఒక విద్యార్థి చదువు అయితే.. ఒక సమాజాన్ని మార్చేది విద్యా వ్యవస్థ" అని యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. విద్యావంతులైన యువతే దేశ భవిష్యత్తుకు బలమైన పునాది అని పేర్కొన్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాల జ్ఞానంతో పాటు సామాజిక బాధ్యత, మానవతా విలువలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఆల్ మదీనా ఎడ్యుకేషనల్ సొసైటీ వంటి విద్యా సంస్థలు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఆల్ మదీనా ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులు మాట్లాడుతూ మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో విద్యాభివృద్ధి కోసం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పేద విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నాలు భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుమ్మాల మమత, డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, ధర్మాపూర్ సర్పంచ్ రాజు గౌడ్, ఇంతియాజ్ ఇసాక్, కాస్మిక్ అహ్మద్, సుజాత్ అలీ, రైజ్ బాయ్, మోయిన్ అలీ, ఆల్ మదీనా ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులు, జీకే ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు, విద్యా రంగ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# శిథిలావస్థలోని ఇళ్లలో నివసించొద్దు

## ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత.. అవసరమైన చర్యలు తీసుకుంటాం: ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్, ఆగస్టు 17 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

మహబూబ్‌నగర్ నగరంలోని రాజీవ్ గృహ కల్పలో శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సోమవారం పరిశీలించారు. అక్కడి పరిస్థితులను స్వయంగా పరిశీలించి, ఇళ్ల పరిస్థితిపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాజీవ్ గృహ కల్పలో నివసిస్తున్న ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఇప్పటికే బలహీనంగా మారి శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లలో నివసించడం ప్రమాదకరమని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఎట్టి పరిస్థితుల్లోనూ నివసించవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల ప్రాణ, ఆస్తి భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వకూడదని అన్నారు. ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న కుటుంబాలకు అవసరమైన సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాజీవ్ గృహ కల్పలో నివసిస్తున్న కుటుంబాల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు మేలు జరిగేలా తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల భద్రత, సంక్షేమం విషయంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వ విప్ దృష్టికి తీసుకురాగా, ఆయన వాటిని సావధానంగా విని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుమ్మాల మమత, డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, ఎన్.పి. వెంకటేష్, సిరాజ్ ఖాద్రీ, సిజే బెనహర్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, అధికారులు, స్థానిక నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



